
మార్కాపురంలో మహిళా దినోత్సవ సభకు హాజరు


- వెలిగొండ ప్రాజెక్టు సందర్శన
- ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి
- కీలక అధికారులతో కలెక్టర్ అన్సారియా భేటీ



8న సీఎం చంద్రబాబు రాక

ఒంగోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 8న జిల్లాకు రానున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో ప్రభుత్వపరంగా నిర్వహించే సభకు హాజరవుతారు. అనంతరం అక్కడకు సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తారు. ఆ మేరకు జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామితో సీఎం చర్చించి కార్యక్రమాన్ని నిర్ణయించారు. సీఎంవో నుంచి అందిన సమాచారంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈనెల 8వతేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఏటా ఆరోజు ప్రభుత్వపరంగా కార్యక్రమాన్ని నిర్వహించడం, ముఖ్యమంత్రి దానికి హాజరడం ఆనవాయితీ. అలాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వం తరఫున రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని తొలుత ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఏర్పాటుకు ఉన్నత స్థాయి అధికారులు మొగ్గు చూపినట్లు సమాచారం. అయితే ఉమ్మడి గుంటూరు నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగి సోమవారం కౌంటింగ్ ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన కోడ్ ఈనెల 6వరకూ అమలులో ఉంది. దీంతో మన జిల్లాలో సభ నిర్వహించాలన్న ఆలోచనకు వచ్చారు. జిల్లా కేంద్రంలో ఈసభ నిర్వహణ విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్ అన్సారియాకు సోమవారం మధ్యాహ్నం ఉన్నతాధికారుల నుంచి వర్తమానం అందింది. మంత్రి డాక్టర్ స్వామితో కూడా ఉన్నతాధికారులు ఇదే విషయంపై మాట్లాడారు. ఇటీవల కందుకూరుకు సీఎం రావడం, గతంలో జిల్లాలో తొలిపర్యటన సంతనూతలపాడు నియోజకవర్గంలో జరిగిన నేపథ్యంలో పశ్చిమప్రాంతంలో బాగుంటుందన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మంత్రి స్వామి చర్చించగా మార్కాపురంలో మహిళా దినోత్సవ సభ ఏర్పాటు చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఆ ప్రాంతానికి వస్తున్నందున వెలిగొండ సందర్శన కూడా కార్యక్రమంలో చేర్చారు. ఆప్రకారం 8వ తేదీ ఉదయం మార్కాపురంలో మహిళా దినోత్సవ సభ, మధ్యాహ్నం తర్వాత దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు సీఎం హాజరయ్యేలా కార్యక్రమాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కలెక్టర్ అన్సారియా సోమవారం రాత్రి అధికారులతో భేటీ అయి ఏర్పాట్లపై చర్చించారు.

జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టును 2026కు పూర్తిచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. ఇప్పటికే ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తికాగా వచ్చే ఏడాదికి మిగిలినవి కూడా చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా లక్ష్యం నిర్దేశించింది. ఆ మేరకు సోమవారం శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే వివరాలలో స్పష్టంగా తెలిపింది. వ్యవసాయ, పారిశ్రామికరంగాలతోపాటు విద్య, వైద్యం, విద్యుత్, సాగునీరు వంటి మౌలిక రంగాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను ఈ సామాజిక, ఆర్థిక సర్వేలో సమగ్రంగా ప్రకటించింది.





వెలిగొండ పూర్తే లక్ష్యం

వచ్చే ఏడాదిలో వినియోగంలోకి ప్రాజెక్టు

ఇప్పటికే ముగిసిన 75శాతం పనులు

- భూగర్భజలం పాతాళంలో ఉన్న వాటిలో జిల్లా మూడో స్థానం
- బ్యాంకు డిపాజిట్ల కన్నా రెట్టింపునకు పైగా రుణాలు
- దీపం-2 లబ్ధిదారుల్లో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానం
- పలు కీలక అంశాలను సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రకటించిన ప్రభుత్వం

ఒంగోలు మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఆయా రంగాలలో సాధించిన ప్రగతి, లక్ష్య సాధనతోపాటు కీలక అంశాలలో జిల్లాల వారీ పరిస్థితిని సామాజిక, ఆర్థిక సర్వేలో ప్రభుత్వం వివరించింది. అందులో కొన్ని అంశాలలో ప్రధానంగా జనాభా పెరుగుదల, స్త్రీ-పురుషుల నిష్పత్తి, జనసాంద్రత వంటి వాటిని ఉమ్మడి జిల్లా ప్రామాణికంగా, మిగతా అంశాలను ప్రస్తుత జిల్లా వారీగా ప్రకటించింది. ఆయా రంగాలలో జిల్లాకు ఒనగూరుతున్న లబ్ధి, జిల్లా స్థానాన్ని పరిశీలిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీపం-2 కింద ఇస్తున్న సబ్సిడీలో అత్యధికంగా లబ్ధిపొందుతున్న వాటిలో జిల్లా రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో 83లక్షల మంది రూ.659.01 కోట్ల మేర ఈ పథకం కింద లబ్ధిపొందుతున్నారు. అందులో జిల్లాలో 3.90 లక్షల మంది లబ్ధిదారులకు రూ.30.98 కోట్ల మేర అందుతోంది. రాష్ట్రంలో ఉన్న మొత్తం సాగు విస్తీర్ణంలో 1.98శాతం జిల్లా కలిగి ఉంది. రాష్ట్రంలో 2024-25లో మొత్తం 10లక్షల మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకొని 91శాతం మందికి ఇచ్చింది. జిల్లాలో 45వేల రుణ అర్హత కార్డుల లక్ష్యానికి 98శాతం మందికి ఇచ్చారు.

పడిపోయిన భూగర్భ జలాలు

రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటిన వాటిలో జిల్లా మూడో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మొత్తం 1,769 చోట్ల నెలనెలా భూగర్భ జలమట్టాల వివరాలు సేకరిస్తుండగా అందులో జిల్లాలో 97 ఉన్నాయి. కాగా 2025 జనవరి గణాంకాల ప్రకారం జిల్లాలోని 97 ప్రాంతాల్లో 17చోట్ల 20 మీటర్ల కన్నా ఇంకా దిగువకు నీటిమట్టం పడిపోయింది. మరో 31చోట్ల 8 నుంచి 20 మీటర్లలోపు భూగర్భ జల మట్టం ఉంది. అంటే అధిక ప్రాంతాలలో సాధారణం (8 మీటర్లు) కన్నా దిగువకు పడిపోయింది. ఖరీఫ్ 2024లో జిల్లాలో రూ.8,413 కోట్ల స్వల్ప, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు అందజేసినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాలో 5.43 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుండగా, లక్షా మూడు వేల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తి జరిగినట్లు అంచనా వేశారు. రాష్ట్రంలో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ఉన్న వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు చర్యలను ప్రభుత్వం చేపడుతుండగా జిల్లాలో అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పనులు 75శాతం జరిగాయి. 2026 నాటికి మిగతావి కూడా పూర్తిచేసే లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

పొదుపు కన్నా అప్పులే అధికం



జిల్లాలో పెద్దఎత్తున బ్యాంకుల నుంచి వివిధ రూపాలలో ప్రజలకు రుణాలు అందిస్తున్నప్పటికీ అందులో సగం కూడా జిల్లా ప్రజల నుంచి డిపాజిట్లు ఉండటం లేదు. మొత్తం 356 వివిధ బ్యాంకు బ్రాంచిలు ఉండగా గడిచిన ఏడాది కాలంలో వాటి ద్వారా రూ. 33,502.72 కోట్ల మేర రుణాలు ఇచ్చారు. డిపాజిట్లు మాత్రం కేవలం రూ.15,349 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 1961-71 మధ్యకాలంలో అక్షరాస్యత కేవలం 29.39శాతం మాత్రమే కాగా 2011 లెక్కల నాటికి 63.08శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంత జనాభా జిల్లా మొత్తం జనాభాలో 1971లో 11.07శాతం ఉండగా 2011 నాటికి 19.56 శాతానికి పెరిగింది. అలాగే జనసాంద్రత కూడా చదరపు కిలోమీటరకు 95 నుంచి 193కు పెరగ్గా స్త్రీ, పురుషుల నిష్పత్తి కూడా క్రమంగా తగ్గింది.

కొత్తపట్నం వద్ద హార్బర్ ప్రతిపాదన

జిల్లాకు కేంద్రం 2011లో మంజూరు చేసిన కనిగిరి ప్రాంత నిమ్జ్ ప్రాజెక్టుపై సమగ్ర రిపోర్టును రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి నివేదించగా కొత్తపట్నం వద్ద ప్రతిపాదించిన హార్బర్ ఉన్నట్లు సర్వే రిపోర్టులో పేర్కొన్నారు. మైనింగ్ ఆదాయం రాష్ట్రంలో ప్రధాన వనరుగా పేర్కొన్న ప్రభుత్వం అందులో జిల్లాలోని గ్రానైట్ కూడా ముఖ్యమైనదిగా పేర్కొంది. వివిధ రకాల ఎగుమతుల పెంపుపై ప్రణాళికను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం ఏ జిల్లాలో ఏ మేర వస్తువులు, సరుకు ఎగుమతికి అవకాశం ఉన్నవన్నవిగా గుర్తించింది. అందులో మన జిల్లాలో గ్రానైట్‌తోపాటు సముద్ర ఉత్పత్తులుగా పరిగణించే చేపలు, రొయ్యలను ప్రధానమైనవిగా పేర్కొంది. ఈ సర్వే ఆధారంగా రానున్న రోజుల్లో ఆయా రంగాల అభివృద్ధి ప్రణాళికలు, పథకాల అమలుతో ప్రజల జీవనప్రమాణాల పెంపు చర్యలను ప్రభుత్వం చేపట్టనుంది.



టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల

- అభ్యంతరాల స్వీకరణకు 9 వరకూ గడువు

ఒంగోలు విద్య, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ డేటా ఆధారంగా దీన్ని రూపొందించారు. జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్, కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచారు. వీటి ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను ఈనెల 9లోపు సంబంధిత అర్‌జేడీ, డీఈవో కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. అభ్యంతరాల సమర్పణలో టీచర్ పూర్తి పేరు, అన్ని వివరాలు, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఆధారాలు ఉంటే జత చేయాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని సంబంధిత హెచ్‌ఎంలు, టీచర్లకు తెలియజేస్తుందని ఆయన తెలిపారు.

ఒంగోలులో సత్య ఫ్లెక్సీలకు బ్రేక్

కార్పొరేషన్ అధికారుల హడావుడి ఉత్తర్వులు

వివరాలు 7వ పేజీలో



ఒంగోలులోని ప్రకాశం భవన్ వద్ద ధర్నా చేస్తున్న టిప్పర్ల యజమానులు

ఇసుక రవాణాపై వేధింపులు

- అనధికారికంగా ఐదు టిప్పర్లు నిలిపివేత
- ధర్నాకు దిగిన యజమానులు

ఒంగోలుక్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఉచితంగా ప్రభుత్వం ఇసుకను అందజేస్తోంది. అయితే రవాణా విషయంలో రాద్ధాంతం నడుస్తోంది. జిల్లాలో ఇసుక లభ్యత లేనందున ఆరు స్టాక్ యార్డులు ఏర్పాటు చేశారు. ఒంగోలు, మార్కాపురం, దర్శి, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండపాలెంలలో ఇసుక నిల్వ ఉంచి కేవలం రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేసి వినియోగదారులకు ఇవ్వాల్సి ఉంది. అదేక్రమంలో వినియోగదారులు నేరుగా పొరుగు జిల్లాలైన నెల్లూరు, గుంటూరు నుంచి కూడా తెచ్చుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఇసుక యార్డుల నిర్వాహకులు ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని నేరుగా టిప్పర్ల ద్వారా ఇతర జిల్లాల నుంచి ఇసుక తరలించే వారిపై దౌర్జన్యాలు చేస్తున్నారు. ఇప్పటికే ఒంగోలు, దర్శిలలో ఇలాంటివి అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. లారీ డ్రైవర్లపై దాడులు చేయడం, నిలిపివేయడం జరిగాయి. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్న స్టాక్ యార్డుల వారిపై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో వారు రూటుమార్చి కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొందరు అనధికారికంగా లారీ యజమానులకు హెచ్చరికలు జారీచేసినట్లు తెలిసింది. దీంతో లారీ యజమానులు పలుమార్లు కలెక్టర్‌ను కలిశారు. ట్రాఫిక్ పోలీసులు ఆదివారం సాయంత్రం పాత జడ్పీ కార్యాలయం సమీపంలో ఉన్న లారీ కాటా వద్ద నెల్లూరు నుంచి ఒంగోలు వైపు ఇసుక లోడ్‌తో వెళుతున్న ఐదు టిప్పర్లను నిలిపివేశారు. అదేక్రమంలో అక్కడకు రవాణా శాఖ అధికారులను పిలిపించారు. ఐదు టిప్పర్‌లపై కేసులు రాస్తామని హెచ్చరించడంతో యజమానులు ప్రాథేయపడ్డారు. తమ దగ్గర వే బిల్లులు ఉన్నాయని చెప్పారు. సోమవారం ప్రకాశం భవన్ వద్ద టిప్పర్ యజమానులు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్టాక్ యార్డు వారి ఒత్తిళ్ల మేరకు తమపై అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో సరఫరా చేసిన తాలూకు ఒంగోలు స్టాక్ యార్డు నుంచి రూ.50లక్షల వరకు రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. దీంతో తాము యార్డుకు తోలకుండా వేబిల్లులతో సొంతంగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ధర్నాలో టిప్పర్ల యజమానుల సంఘం అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



సజావుగా సీనియర్ ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు 18,450 మంది హాజరు

ఒంగోలు విద్య, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు లాంగ్వేజీ పేపర్-2 సజావుగా జరిగింది. 9 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం లేటైనా అనుమతించేది లేదని ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రకటించడంతో విద్యార్థులు అర్ధగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే సిబ్బంది లోపలికి పంపారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించ లేదు. 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా తొలిరోజు జనరల్ 16.659 మంది, ఒకేషనల్ 1,791 మంది కలిపి మొత్తం 18,450 మంది విద్యార్థులు హాజరయ్యారు. 593 మంది జనరల్, 70 మంది ఒకేషనల్ విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐవో సైమన్‌విక్టర్ ఐదు, డీఈసీ, డీఐఈవోలు పది, స్క్వాడ్ అధికారులు 33 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



ఒంగోలులోని ఓ కేంద్రం వద్ద తమకు కేటాయించిన గదుల నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- నిర్దేశిత గడువులోపు ఎంఎస్ఏఈ, పీ-4 సర్వేలను పూర్తి చేయాలి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ఎంఎస్ఏఈ, పీ-4 సర్వేలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వేను ఈనెల 15లోపు, పీ-4 సర్వేను మంగళవారం సాయంత్రం లోపు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది వంద శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీన్ని ప్రతిరోజూ ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి పథకం పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవోలు, ఏపీడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించడంతోపాటు లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, శ్రీనివాసప్రసాద్, జోసఫ్‌కుమార్, వెంకటనాయుడు, శ్రీనివాసరావు, డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డాక్టర్ బేబీరాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా 'ఓపెన్' పరీక్షలు

- కాపీయింగ్‌కు కళ్లెం
- కేంద్రాలపై స్క్వాడ్‌ల దాడులు
- ఆర్‌జేడీ పర్యవేక్షణ, రాష్ట్ర కోఆర్డినేటర్లు రాక

7

పది పరీక్షల హాల్ టికెట్లు సిద్ధం

వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

7

వెలుగు ఏపీఎంపై కేసు

పెద్ద దోర్నాల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగిని వేధించిన విషయమై పెద్దదోర్నాల మండల ఏపీఎం దర్శనం పోలయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెలుగు పరిధిలోని ఓ అనుబంధ విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని తరచూ పోలయ్య లైంగికంగా వేధిస్తున్నాడు. ఆమె తన భర్తకు తెలియజేసింది. ఆయన సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపూర్వ సేవకులు

- సేవాస్ఫూర్తి కమిటీగా పూర్వ విద్యార్థులు
- దశాబ్ద కాలం నుంచి కార్యక్రమాలు
- పాఠశాలలో వసతుల కల్పనతో మొదలు..
- అనాథ, వృద్ధాశ్రమాలకు సహాయ సహకారాలు



శింగరకొండలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సేవాస్ఫూర్తి కమిటీ సభ్యులు

7

రిమ్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ, జీజీహెచ్, నర్సింగ్ కాలేజీలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ప్రకాశం.ఏపీ.జీఓవి.ఇన్/నోటీస్ కేటగిరీ/రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి, విద్యార్హత సర్టిఫికెట్‌లతో జతపరచాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటలోపు వ్యక్తిగతంగా కానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలుకు అందించాలని తెలిపారు

24న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగాన్ని కాపాడుకొనేందుకు ఈనెల 24వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఈ-రిక్షా నుంచి ఆటో, లారీ, ట్యాక్సీ ప్రైవేటు బస్సులు, ఆర్టీసీ, స్కూలు బస్సులు, అంబులెన్స్, ట్రక్స్ మినీ వెహికిల్స్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయన్నారు. తంబి శ్రీనివాసులు, మున్నా బాషా పాల్గొన్నారు.

పరిశోధన నిబంధనావళి ఆవిష్కరణ

ఒంగోలు విద్య, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ పరిశోధన నిబంధనావళి పుస్తకాన్ని సోమవారం వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి ఆవిష్కరించారు. యూనివర్సిటీలో ప్రస్తుతం పరిశోధనల కోసం చేరిన స్కాలర్లు, వారికి అనునిత్యం సూచనలు, సలహాలను అందించనున్న రీసెర్చ్ డైరెక్టర్లకు ఈ పుస్తకం దిక్సూచిగా పనిచేస్తుందని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, జి. రాజమోహనరావు, నిర్మలామణి, సోమశేఖర్ ఉన్నారు.

చుండూరి రంగారావుకు ఎన్జీ రంగా అవార్డు

మద్దిపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మండలం వెంకటరాజుపాలేనికి చెందిన చుండూరి రంగారావు నేడు ఎన్జీ రంగా రైతుబంధు అవార్డును అందుకోనున్నారు. ఎన్జీరంగా స్ఫూర్తితో రైతు సమస్యలపై చుండూరి రంగారావు అలుపెరుగని ఉద్యమం చేస్తున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన రంగారావు మద్దిపాడు మండల పరిషత్ అధ్యక్షునిగా సేవలందించారు. 1998-2005 మధ్య కాలంలో పొగాకు బోర్డు సభ్యునిగా పనిచేశారు. ఎన్జీ రంగా భవనంలో రైతు సంఘ నాయకులను సమన్వయం చేయటంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. రైతు ఉద్యమాలు చేపట్టి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా నేడు హైదరాబాదులో ఎన్జీ రంగా రైతుబంధు అవార్డును అందుకోనున్నారు.

6న నందిపాడు వ్యవసాయ పరపతి సంఘ సమావేశం

మద్దిపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపాడు వ్యవసాయ పరపతి సంఘ సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో ఎన్. చంద్రారెడ్డి తెలిపారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో రైతులందరూ హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా అధికారి

మద్దిపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ బి.శ్రీవాణి ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో టీబీ రికార్డ్స్, రిపోర్ట్స్, లెప్రసీ రికార్డ్స్, ఎయిడ్స్‌కు సంబంధించిన రికార్డ్స్‌ను ఆమె పరిశీలించారు. జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ మోహన్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహం నిర్వాహకుడికి రిమాండ్

ఒంగోలు క్రైం, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహం నడుపుతున్న పి.నాగరాజుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఆదివారం స్థానిక సీతారామపురంలో హిల్‌టవర్ పక్కన ఉన్న ఓ ఇంటిలో పోలీసులు దాడి చేసి వ్యభిచార గృహం నిర్వాహకుడు నాగరాజుతోపాటు నలుగురు మహిళలు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరచగా నాగరాజుకు 14 రోజులు రిమాండ్ విధించారు. ముగ్గురు విటులకు 41 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులు జారీ చేశారు. నలుగురు మహిళలను విజయవాడలోని ఉజ్వల శక్తిసదన్‌కు పంపించారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఆయాశాఖల అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈకార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని చెప్పారు. డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, వరకుమార్, విజయజ్యోతి పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

బాలికలు స్వేచ్ఛగా ఎదిగేలా వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ రిమ్స్ నుంచి నెల్లూరు బస్టాండు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా రోజూ ఒక ఇతివృత్తంతో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు హేనా సుజన్ తదితరులు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అన్సారియా

మిర్చిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు క్వింటా రూ.25వేలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతి బాబు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చీడపల వల్ల, వాతావరణం సరిగా లేక దిగుబడి బాగా తగ్గిపోయిందన్నారు. ఎకరాకు 5నుంచి 10 క్వింటాళ్లు కూడా రావడంలేదని చెప్పారు. మిర్చికి ధర లేకపోవడంతో రైతులు ఎకరాకు లక్ష రూపాయల వరకు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.11,781 ధర రైతుకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ మిర్చిని ప్రభుత్వం నిర్ణయించిన ధరలు శాస్త్రీయంగా లేవన్నారు. రైతులు గత ఏడాది పండిన పంట కూడా కోల్డ్‌స్టోరేజీల్లో దాచుకున్నారని, ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. క్వింటాకు రూ.25వేలు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, నల్లూరి నరసింహారావు, రాయళ్ల వెంకటరావు, హనుమాన్‌బాబు, పాలపర్తి యోనా, ఊదరగుడి సుబ్బయ్య, పున్నయ్య, పెద్ద కోటయ్య, రామకృష్ణ, వీరాంజనేయులు, మూర్తి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆప్కాస్ విధానం రద్దు తగదు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్ విధానం రద్దు తగదని.. దాని స్థానంలో అమలుచేయనున్న ప్రైవేటు కాంట్రాక్టు విధానాన్నీ ఉపసంహరించుకోవాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్‌డీ సర్దార్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయడం వల్ల కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం సరికాదని చెప్పారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. నగరంలో పనిచేసిన మేస్త్రీలందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌లు వచ్చే పరిస్థితి లేదన్నారు. దానివల్ల కార్మికులు శ్రమదోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. మునిసిపల్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత సమ్మె కాలంలో వేతనాల పెండింగ్, పెంపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాసర్, హరిబాబు, కిరణ్, శేషయ్య, చెన్నయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, గోపి ఉన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషును కలిసి వినతిపత్రం అందజేశారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్‌డీ సర్దార్

బాధితులకు సత్వరమే న్యాయం అందించండి

ఎస్పీ స్పందన కార్యక్రమానికి 78 వినతులు

ఒంగోలు క్రైం, మార్చి3(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు జారీ చేశారు.సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని పలుప్రాంతాల నుంచి 78 మంది తమ వినతులను అందజేసారు. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

ఒంగోలులో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సెయింట్ జేవియర్స్ స్కూలును ఎస్పీ దామోదర్ పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న పోలీసు అధికార్లు ,సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 67 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే 112, 100 వాట్సప్ నంబరు 9121102266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలుకా ఎస్సై సందీప్ ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

కొన్ని ఫిర్యాదులు

-తన కుమార్తె వివాహం కోసం దాచుకున్న నగదు రూ.5 లక్షలను అప్పుగా తీసుకొని ఇవ్వకపోగా అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడని మద్దిపాడు మండలం నేలటూరుకు చెందని ఓ బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

-ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఐదుగురి వద్ద రూ.1.5 లక్షల చొప్పున తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తిరిగి నగదు ఇవ్వలేదని దర్శికి చెందిన ఓ నిరుద్యోగి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్‌బాబు, సుధాకర్, జగదీష్, పాండురంగారావు, ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

రేపు దామచర్ల సత్య జన్మదిన వేడుకలు

భారీ ఏర్పాట్లలో అభిమానులు, టీడీపీ శ్రేణులు

ఒంగోలులో కార్యక్రమం

ఒంగోలు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ(సత్య) జన్మదినం అయిన ఈ నెల 5వ తేదీన ఆ రోజున వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఒంగోలులోని ధారావారితోటలో ఉన్న దామచర్ల కంపెనీ వద్ద ఈ వేడుకలు జరగనుండగా ఆ ప్రాంతం అంతా ఇప్పటికే సత్య జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేశారు. ఈసారి టీడీపీ అధికారంలోకి రావడం సత్యకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించడం అలాగే సత్య పార్టీపరంగా బాధ్యతలు నిర్వర్తించే కొండపి నియోజకవర్గం నుంచి ఎన్నికైన డాక్టర్ స్వామి మంత్రి పదవి లభించడం వంటి పరిణామాల నేపథ్యంలో మరింత ఉత్సాహంగా వేడుకలకు అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ఒంగోలులోని ధారావారితోటలో దామచర్ల కంపెనీగా పేరున్న గోడౌన్ ప్రాంగణాన్ని ఇటీవల ఆధునీకీకరించారు. మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్యలు ఇక నుంచి తమ క్యాంపు కార్యాలయంగా ఆ ప్రాంగణాన్ని వినియోగించేలా విశాలమైన చాంబర్లు, మినీ సమావేశపు హాలు, కిచెన్ ఇతరత్రా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అలా ఆధునికీకరించిన ప్రాంగణాన్ని సత్య తల్లిదండ్రులు దామచర్ల పూర్ణచంద్రరావు, విజయలక్ష్మిల దంపతులు సోమవారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ ప్రాంగణంలోనే సత్య జన్మదిన వేడుకలు జరగనున్నాయి.



పూజలు చేస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు

సబ్సిడీపై సరుకులు అమ్మకాలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రైతు బజార్లలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు, వంటనూనెలను సబ్సిడీ ధరలపై విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. జిల్లాలో సన్న, మధ్యతరగతి రైతులు వారి కూరగాయల ఉత్పత్తులకు రైతు బజార్లు వేదిక కావాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో కనిగిరిలో ప్రారంభం కానున్న రైతు బజారులో డ్వాక్రా సభ్యులకు నిబంధనల ప్రకారం షాపులు కేటాయింపు చేయాలన్నారు.

సెంటర్ డివైడర్లలో ఫ్లెక్సీలు నిషేధం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో అభివృద్ధి పనులు, ఆధునికీకరణలో భాగంగా సెంటర్ డివైడర్లు, రోడ్లలో పనులు జరుగుతున్నందున నగరంలో ఫ్లెక్సీలు నిషేధించినట్లు నగర కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని, ఫ్లెక్సీలు కట్టకూడదని కోరారు.

గృహ వినియోగదారులకు రాయితీ

సంతనూతలపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అదనపులోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఒక కిలోవాట్‌కు డెవలెప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు కట్టాలని, ఈస్కీం కింద వెయ్యి రూపాయలు కడితే సరిపోతుందని చెప్పారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పుండదన్నారు. వివరాలకు విద్యుత్ కార్యాలయం సిబ్బందిని కలవాలన్నారు.

రైతుల వివరాలను అప్‌డేట్ చేయాలి

సంతనూతలపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రబీలో సాగుచేసి ఇంకా ఈ-పంటనమోదు, ఈకేవైసీ పూర్తికాకుండా ఉన్న రైతుల వివరాలను అప్‌డేట్ చేయాలని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్‌బాబు చెప్పారు. సంతనూతలపాడులోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో సోమవారం సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల ఏవోలు పావని, భాస్కర్, ఏఈవోలు కేవీ సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరావు పాల్గొన్నారు.

అవీఇవీ

క్విజ్‌లో రిమ్స్ విద్యార్థిని ప్రతిభ



మెడికల్ విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలోని ఎయిమ్స్‌లో జరిగిన రాష్ట్ర క్విజ్ పోటీలలో ఒంగోలు రిమ్స్ మెడికల్ కాలేజి పీజీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్. దివ్య తృతీయస్థానంలో నిలిచారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని రిమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పెథాలజీ డాక్టర్ సుధాకర్, ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొని అభినందించారు.

'ఫెన్సింగ్'లో హైదరాబాద్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో ఒంగోలులోని హైదరాబాద్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 2వ తేదీన విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో హెచ్‌పీఎస్ విద్యార్థులు ప్రియ గోల్డ్ మెడల్, చరణ్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్కూలు కరస్పాండెంట్ జగదీష్ విజేతలతోపాటు, పీఈటీ అనీల్‌ను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జగదీష్

చెవి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వినికిడి దినోత్సవ ర్యాలీలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేంద్రియాలలో ముఖ్యభాగమైన చెవిపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు చెవి పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చెవిటివారిగా తయారు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందరికీ చెవి, వినికిడి సంరక్షణను శక్తివంతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, డాక్టర్ ప్రీతమ్, డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు, ఎపిడెమియాలోజిస్ట్ విక్టర్‌బాబు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'వెలిగొండ'కు 2 వేల కోట్లు కేటాయించాలి

సంతనూతలపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని, అదేవిధంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని మండలంలోని పేర్నమిట్టలో సోమవారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బంకా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, ఇది కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని విమర్శించారు. బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాను విస్మరించిందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి రూ.పదివేల కోట్లను కేటాయించాలని కోరారు. 30ఏళ్ల నాడు మొదలుపెట్టిన వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేయడంలో ప్రభుత్వాలు సవతి ప్రేమను చూపిస్తున్నాయని ఎద్దేవాచేశారు. బడ్జెట్‌లో అన్నిరంగాలకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏవీ సుబ్బారావు, డీ చినబాబు, యూ రామక్రిష్ణ, టీ సుబ్బారావు, రామక్రిష్ణారెడ్డి శేషయ్య పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

ఒంగోలు(రూరల్) మార్చి 3, (ఆంధ్రజ్యోతి) : పన్నెండో పీఆర్సీని వెంటనే నియమించాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బి.అంకిరెడ్డి చెప్పారు. ఒంగోలు నగరం పులి వెంకటరెడ్డి కాలనీలో గల పున్నయ్య పెన్షన్ భవన్‌లో సోమవారం జిల్లా పెన్షనర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు బీ అంకిరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై నుంచి ఇవ్వాల్సిన పీఆర్సీ ఆలస్యమైనందున మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లాకార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు పాల్గొన్నారు

బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ, ర్యాలీ

సంతనూతలపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలో పేర్నమిట్ట, సంతనూతలపాడు గ్రామాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బంగారు బాల్యం కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు కొవ్వొత్తుల ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఈఓఆర్డీ రమణమ్మ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ, టాటా స్టీల్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ పూర్తి చేసి లేదా ఐటీఐ అప్రంటీస్ షిప్ పూర్తి చేసి 18 ఏళ్లు నిండిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ పదో తరగతి, ఐటీఐ/అప్రంటిస్ షిప్ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజనల్ తో పాటు ఒక సెట్ జెరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు.

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబుకు సన్మానం

కొండపి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయంగా పొగాకుకి గిరాకీ ఉన్నప్పుడు రైతులకు అపరాధ రుసుం ఎందుకు విధించాలని తాను పట్టుపట్టి తొలగింపునకు కృషి చేశానని పొగాకు బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఆయన్ను స్థానిక వేలం కేంద్రంలో రైతులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రైతులు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. భవిష్యత్‌లో కూడా పొగాకు రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి లాభాలు గడించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య మాట్లాడుతూ శ్రీధర్‌బాబు పనిచేసిన ఏడున్నరేళ్లపాటు పొగాకు రైతుల సంక్షేమం కోసం పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎం. ఎం.లక్ష్మణరావు, బోర్డు ఆక్షన్ మేనేజర్ కె.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు పోటు శ్రీనివాసమురళి, నాగినేని భాస్కర్‌రావు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, కొల్లూరి హరిబాబు, బీఎల్ నరిసింహం, నన్నూరి సుబ్బరామయ్య పాల్గొన్నారు.

సాక్షి రామలింగేశ్వరునిపై సూర్యకిరణాలు

చీమకుర్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రసిద్ధ సాక్షిరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ శివరాత్రి తర్వాత మూలవిరాట్ శివలింగంపై సోమవారం సూర్యకిరణాలు ప్రసరించాయి. ఈ దృశ్యాన్ని భక్తులు పెద్దఎత్తున తిలకించి పూజలు చేశారు.



మూలవిరాట్‌ని తాకిన సూర్యకిరణాలు

ఆ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది. టంగుటూరి ప్రకాశం పంతులుతో పాటు ఎందరో మహానుభావులు చదివిన బడి అది. ఆ స్ఫూర్తి అక్కడ చదివిన పూర్వ విద్యార్థులనూ చైతన్యపరిచింది. పది మందికి అండగా నిలిచేలా చేసింది. పేదలకు ఆర్థిక సాయం అందించడానికీ, సేవా కార్యక్రమాలకూ బాటలు వేసింది. ఆ పూర్వ విద్యార్థులే.. ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989-90 పదవ తరగతి బ్యాచ్. పాతికేళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలిసి 'సేవాస్ఫూర్తి' కమిటీగా ఏర్పడి దశాబ్ద కాలంగా పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



తాము చదివిన కళాశాలకు ఆర్చీ గేటు నిర్మించి ప్రారంభోత్సవం సందర్భంగా హాజరైన పూర్వ విద్యార్థులు (ఫైల్)

అపూర్వ సేవకులు

- సేవాస్ఫూర్తి కమిటీగా పూర్వ విద్యార్థులు
- దశాబ్ద కాలంగా కార్యక్రమాలు
- పాఠశాలలో వసతుల కల్పనతో మొదలు..
- ఆపదలో ఉన్న స్నేహితులకు ఆర్థిక సాయం
- అనాథ, వృద్ధాశ్రమాలకు సహాయ సహకారాలు
- కలిసికట్టుగా ముందుకు సాగుతున్న స్నేహితులు


చైతన్య బధిరుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సేవాస్ఫూర్తి కమిటీ సభ్యులు (ఫైల్)

అద్దంకి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలగా విభజించారు. రెండు పాఠశాలలు కలిసి ఉన్న సమయంలో 1989-90 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు తరువాత కాలంలో వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. 25 ఏళ్ల తరువాత అందరూ ఒకచోట కుటుంబసభ్యులతో కలిసి 2015 జనవరి 12న అద్దంకిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సేవాస్ఫూర్తి కమిటీగా ఏర్పడ్డారు. తొలుత తాము చదివిన పాఠశాలలకు తమవంతుగా ఏదో విధంగా సహకారం అందించాలన్న సంకల్పానికి వచ్చారు. అంతేకాకుండా అద్దంకి ప్రాంతంలో గత దశాబ్ద కాలంలో పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత దశాబ్ద కాలంలో సుమారు రూ.45 లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలలో కొన్ని..

- ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణానికి ఆర్చీ, ఇనుప గేటు ఏర్పాటు చేశారు.
- ప్రకాశం ప్రభుత్వ పాఠశాలలో 10 టేబుల్స్ అందించారు.
- ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థుల స్టడీకి ఉపయోగపడేలా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారు.
- శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్, కూలింగ్ వాటర్ ఫ్రిజ్ ఏర్పాటు చేశారు.
- గత 10 సంవత్సరాలుగా శింగరకొండలోని రెండు వృద్ధా శ్రమాలలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.
- కొవిడ్ సమయంలో పేద ప్రజలకు, మున్సిపల్ కార్మికులకు, కొవిడ్ సెంటర్‌లోని బాధితులకు నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారు.
- పలు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు, ఎగ్జామ్ ప్యాడ్‌లు పంపిణీ చేశారు.
- ఇంజనీరింగ్ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత
- గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆర్థిక సహాయం అందించారు.
- అద్దంకి శివారు కాలనీల్లో మూడేళ్లపాటు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేశారు.


చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు (ఫైల్)

సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆనందంగా ఉంది



'గెట్ టుగెదర్ పేరుతో మొదలై సేవా విజయవంతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. అంతా ఒకే కుటుంబం అనే భావన అందరిలో వచ్చింది. ఎవరికి సమస్య వచ్చినా అందరం కలిసి సాయంగా నిలబడతాతం. భవిష్యత్‌లో కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం'

- దామా వెంకటేశ్వర్లు(డి.వి), సేవాస్ఫూర్తి కమిటీ

ఆ బ్యాచ్‌లో చదవటం నా అదృష్టం



1989-90 బ్యాచ్‌లో 10వ తరగతి చదవటం నా అదృష్టంగా భావిస్తున్నా. ఆత్మీయ సమావేశాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కలిగింది. స్నేహితుల్లో ఎవరికి ఏ అవసరం ఉన్నా మిగిలిన అందరు ముందుకు వస్తున్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు చాలా బాగా సహకరిస్తున్నారు.

-జ్యోతి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి, సేవాస్ఫూర్తి కమిటీ

పరీక్షకు పరుగు

సీనియర్ ఇంటర్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. తొలిరోజు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దిష్ట సమయానికి ముందే చేరుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలను చూసుకోడం, ఆలయాల్లో పూజలు చేయడంతోపాటు తల్లిదండ్రులను తోడు తెచ్చుకుని ధైర్యంగా పరీక్ష గదికెళ్లడం లాంటి దృశ్యాలు ఒంగోలులో కనిపించాయి.


బారుతీరి..


తనిఖీ చేసి..


దేవుడా.. గట్టెకించు..!

ఇదిగోమ్మా నంబరు

సజావుగా ఓపెన్ పరీక్ష

- కేంద్రాలపై స్క్వాడ్‌ల దాడులు
- ఆర్‌జేడీ పర్యవేక్షణ, రాష్ట్ర కో ఆర్డినేటర్లు రాక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు విద్య, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ) ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మొదటి రోజైన సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 'కాపీయింగ్‌కు కలెక్షన్' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖలో చలనం వచ్చింది. రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. మొదటి రోజు పరీక్షల్లో కాపీయింగ్‌కు కళ్లెం వేశారు. పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి స్పందించి వెంటనే డీఈవో కిరణ్‌కుమార్‌కు ఫోన్ చేసి పరిస్థితిని సమీక్షించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక మండల విద్యాధికారిని పర్యవేక్షకుడిగా నియమించారు. పరీక్ష నిర్వహణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని, పరీక్షలు ముగిసే వరకు అన్ని కేంద్రాలకూ ఎంఈవోలు పర్యవేక్షకులుగా వెళ్లాల్సిందేనని ఆర్‌జేడీ స్పష్టంచేశారు. తర్వాత ఫోన్‌లో కూడా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. డీఈవో కిరణ్‌కుమార్ సైతం పరిస్థితి తీవ్రతను గుర్తించి ఉదయం సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోలకు హెచ్చరికలు జారీ చేశారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్‌తో పాటు చీఫ్‌లు, డీవోలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తప్పు జరిగితే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి వార్తకు ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ కార్యాలయం కూడా స్పందించింది. రాష్ట్ర కార్యాలయంలో కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న రవీంద్రనాథ్‌ను దర్శికి, షేక్ అక్బర్ అలీఖాన్‌ను ఒంగోలు, సంతనూతలపాడు పరీక్షా కేంద్రాలకు పంపించారు. ఈ స్క్వాడ్‌లు కాకుండా జిల్లాలోని 21 పరీక్షా కేంద్రాలకు 21 సిట్టింగ్ స్క్వాడ్‌లను డీఈవో నియమించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా అన్ని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. డీఈవో కిరణ్‌కుమార్ ఒంగోలులోని రెండు, సంతనూతలపాడులోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

2,846 మంది హాజరు

ఓపెన్ ఇంటర్ రాత పరీక్షకు 3702 మంది హాజరు కావాల్సి ఉండగా 2846 మంది హాజరయ్యారు. 856 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మొదటి రోజు ఇంగ్లీషు పరీక్ష జరిగింది. పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగింది. పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు పరీక్షా కేంద్రాల తనిఖీకి రెవెన్యూ అధికారులను కూడా నియమించారు.


వేమలకోటలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ చిరంజీవి

ప్రభుత్వ భూమి తిరిగి స్వాధీనం

భూమి విలువ రూ.3కోట్ల పైమాటే

మార్కాపురం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమలకోట గ్రామ పరిధిలో ఆక్రమణదారుల నుంచి రూ.3కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తహసీల్దార్ చిరంజీవి రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ వేమలకోట గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 982లో 101.69 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. ఆ భూమిలో 32 ఎకరాలను పలువురు ఆక్రమించుకున్నారు. 2024 డిసెంబర్ 24న గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు ఆక్రమణలను తొలగించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఆ భూమిని పశువులకు మందబయలు భూమిగా వినియోగించాలని కోరారు. వారు ఇచ్చిన వినతిని పరిశీలించి ఆక్రమణలను గుర్తించి వారికి చట్టప్రకారం నోటీసులను అందించి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిలో ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగించారు. స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

పది పరీక్షల హాల్ టిక్కెట్లు సిద్ధం

ఒంగోలు విద్య, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ప్రిన్సిపాల్స్ వాట్సాప్ ద్వారా విద్యార్థుల హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 95523 00009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే స్క్రీన్‌పై సేవలను ఎంచుకొండి అని వస్తోంది. విద్యాసేవలను ఎంపిక చేసుకొని ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ అని టైప్ చేయాలి. తర్వాత అప్లికేషన్ నెంబరు, విద్యార్థి చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీ స్ట్రీమ్ టైప్ చేసిన అనంతరం ఆ వివరాలను మళ్లీ ధ్రువీకరించాలి. ఆ తర్వాత వాట్సాప్‌కు విద్యార్థి హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ అవుతుంది.

ఒంగోలులో సత్య ఫ్లెక్సీలకు బ్రేక్

- కార్పొరేషన్ అధికారులు హడావుడిగా ఉత్తర్వులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు నగరంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ(సత్య)కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలకు కార్పొరేషన్ అధికారులు బ్రేక్ వేశారు. బుధవారం సత్య జన్మదినోత్సవ కార్యక్రమం జరగనుంది. ఆ సందర్భంగా దివంగత దామచర్ల ఆంజనేయుల కాలం నుంచి వారు ఉంటున్న భాగ్యనగర్‌లోని దామచర్ల కంపెనీలో వేడుకలు చేసుకునేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఏటా జన్మదిన వేడుకలను స్థానికంగా జరుపుకోవడం సత్యకు ఆనవాయితీ. తదనుగుణంగా కొండపి నియోజకవర్గం, ఒంగోలు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉండే ఆయన అనుచరులు శుభాకాంక్షలు తెలిపేందుకు ఫ్లెక్సీలు వేస్తారు. ఈ దఫా కూడా సత్యకు శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలు ఆదివారం రాత్రికే జిల్లా పరిషత్ వద్ద నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆయన ఫ్లెక్సీల్లో కొన్నింటిని కార్పొరేషన్ అధికారులు తొలగించారు. మిగిలినవి కూడా తొలగించాలని ఆదేశించారు. అయితే కారణమేమైనా సోమవారం మధ్యాహ్నం తర్వాత ఫ్లెక్సీల ఏర్పాటుకు కార్పొరేషన్ అధికారులు అనుమతిచ్చారు. దీంతో సత్య అభిమానులు సోమవారం రాత్రికి ఫ్లెక్సీల ఏర్పాటుకు సిద్ధమై ఆ పనిలో నిమగ్నమయ్యారు. అనూహ్యంగా సోమవారం రాత్రి కమిషనర్ వెంకటేశ్వరరావు అధికారికంగా నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ ఉత్తర్వులు జారీచేశారు. డివైడర్లలో మొక్కలు నాటడం, అలాగే రోడ్ల ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున నగరంలో ఎక్కడా ఎలాంటి ఫ్లెక్సీలు అనుమతించమని కమిషనర్ వెంకటేశ్వరరావు ఇచ్చిన లిఖితపూర్వక ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో మారిటైం బోర్డు చైర్మన్ సత్య ఫ్లెక్సీల ఏర్పాటుకు అడ్డంకి ఏర్పడింది. 24గంటల వ్యవధిలోనే అధికారుల నుంచి విభిన్న అభిప్రాయాలను మౌఖికంగా, లిఖితపూర్వకంగా విడుదల చేయడంతో ఈ వ్యవహారం రాజకీయపరమైన జోక్యం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తంపై కమిషనర్ ఆదేశాల మేరకు సత్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలు ఏర్పాటుకు బ్రేక్ పడినట్లుగానే భావిస్తున్నారు.

అవీ..ఇవీ

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్

మార్కాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత కావాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాలను నిర్మూలించేందుకు సంతకాల సేకరణ, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనుప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సామాజిక రుగ్మతలాంటి బాల్య వివాహనాలను అందరూ కలిసి సమష్టిగా నిర్మూలించాలన్నారు. ముందుగా సబ్ కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం ఐసీడీఎస్ శాఖ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో బి.సుశీలదేవి, సూపర్‌వైజర్లు ఎమ్.బుజ్జి, కె.రవికుమారి, కె.రమ, కార్యకర్తలు, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

కంభం : బాలికల సంరక్షణకు ప్రతిఒక్కరూ సంకల్పించాలని, బాలక విద్యకు ప్రాముఖ్యత నివ్వాలని, సీడీపీవో నీలోఫర్ వ్యాఖ్యానించారు. సోమవారం స్థానిక గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలిక విద్యకు, బాలికల సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించి సంతకాలు సేకరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నాగచెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయించడం నేరం

మార్కాపురం రూరల్: బాల్య వివాహాలు చేయించడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలోమి అన్నారు. మండలంలోని గోగుల దిన్నె గ్రామంలో సోమవారం మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల మొక్కలను మహిళలతో నాటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద శ్రీను, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఏ ఎన్ఎం సునీత, అంగన్‌వాడీ కార్యకర్త టి మల్లేశ్వరి, ఎంఎస్‌కె భాగ్యలక్ష్మి, గ్రామస్తులు పార్వతి, పాల్గొన్నారు.

బాలకార్మిక చట్టాలపై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వై.పాలెంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య అధ్వర్యంలో జయహో మహిళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని బాలికలకు యోగా తరగతులు నిర్వహించారు. అనంతరం సైబర్ క్రైమ్, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాలకార్మిక చట్టాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వాటి నుండి రక్షణ ఎలా పొందాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారి తిరుమల దేవి, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

గిద్దలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని వివేకానంద, జీవనజ్యోతి, సాహితి జూనియర్ కళాశాలల్లోని 3 పరీక్ష కేంద్రాలలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి చెందిన 690 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. వీరిలో 52 మంది గైరుహాజరయ్యారు. 638 మంది పరీక్షలు రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్‌లు, అధికారులు తెలిపారు. పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఒ) ఎ.సైమన్ విక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, పరీక్ష కేంద్రాలలో కల్పించిన వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు పరీక్షల కస్టోడియన్ ఎ.అల్లూరయ్య తెలిపారు.

కంభం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కంభం మండలంలో సోమవారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 4 పరీక్ష కేంద్రాలను కేటాయించారని, వీటిలో మొత్తం 1356 మందికి గాను 73 మంది గైరుహాజరైనట్లు కస్టోడియన్ అధికారి శివశంకర్ తెలిపారు.

గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో పశువైద్యులు శివారెడ్డి అధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసే కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పశువులకు ప్రస్తుతం గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందని ఆ వ్యాధి వలన పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టపోతారన్నారు. కావున పశువులు కలిగిన రైతులు తప్పనిసరిగా వ్యాధి నివారణకు అవసరమైన టీకాలు(వ్యాక్సిన్) వేయించాలన్నారు. మార్చి 30వ తేదీ వరకు మండలంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుఆరోగ్య సహాయకులు మజీద్, వలి, నారాయణ, యల్లారెడ్డి, షేక్ బాజీ, షేక్ షబ్బీర్, రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గిద్దలూరు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరాం లాడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. లాడ్జి సమీపంలో మృతి చెందిన ఉన్న వ్యక్తి కనిపించడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సమాచారం అందుకున్న పోలీసులు మృతుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఆవిష్కరణ దిశగా ఆలోచించాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వై.రవి కుమార్ అన్నారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో జేవీవీ ఆధ్వర్యంలో సైన్సు డే వారోత్సవాలు నిర్వహించారు. చకుముకి పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థు లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ప్రారంభం


స్కౌట్స్, గైడ్స్ యూనిట్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గిద్దలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ప్రారంభమయ్యాయి. దేశభక్తి, క్రమశిక్షణ, సేవాగుణాన్ని స్కౌట్స్ గైడ్స్ యూనిట్లలో చేరిన వారికి ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. స్వయం నియంత్రణ పెరుగుతుందని, సేవాగుణం అలవడుతుందని, కులమతజాతి వివక్ష ఉండదని పలువురు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు, హైస్కూల్ స్థలదాత గంజి వీరయ్య, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, యూనిట్ ఇన్‌చార్జిలు జాన్సన్, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశుపోషకులకు గోకులం షెడ్లతో ఊతం

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


కొలుకులలో పూర్తయిన షెడ్డులో మూగజీవాలు

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులకు ఊతం ఇచ్చేలా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్మిస్తోంది. జూదంగా మారిన వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు పశుపోషణకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ పశువుల షెడ్లు రైతులకు లబ్ధి చేకూరుస్తున్నాయి.

ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ప్రభుత్వం 23 షెడ్లను మంజూరు చేసింది. మండలంలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలంలోని లబ్ధిదారులు నిర్మాణాలు మొత్తం పూర్తి చేశారు. ఇప్పటికే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, నాయకులు, అధికారులతో కలసి ఇటీవల కొన్ని ప్రారంభించారు. గతంలో పశువులకు సరైన వసతులు లేక ఇంటి ప్రాంతంలోని చెట్ల కింద రక్షణ లేకుండా కట్టేవారమని పశువుల యజమానులు చెబుతున్నారు. అలాగే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పశువులు ఉండేవని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వంలో గోకులం షెడ్డులు మంజూరు చేయ డంతో వాటిని వేగంగా పూర్తి చేసుకున్నట్లు కొలుకుల, మొగుళ్లపల్లి, బోయలపల్లి, ఎర్రగొండపాలెం తదితర గ్రామాల రైతులు, లబ్ధిదారు లు పేర్కొటున్నారు. ఈ గోకులం షెడ్లతో మూగజీవాలకు నీడ, రక్షణ ఉంటుందని తెలిపారు.

బిల్లుల్లో అలస్యం

గోకులం షెడ్ల నిర్మాణం వేగంగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులు అదేశాలు జారీ చేయడంతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే నిర్మాణాలు పూర్తయినా బిల్లులు పడలేదని లబ్దిదారులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణాలు చేపట్టి పూర్తయిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని మండలంలోని రైతులు (లబ్దిదారులు) కోరుతున్నారు. ఈ విషయంపై ఉపాధి హామీ పథకం ఎర్రగొండపాలెం ఏపీవో శైలజను వివరణ కొరగా అన్నిటికి ఎం-బుక్‌లు సిద్ధం చేసి బిల్లులు పెట్టినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే లబ్దిదారులకు డబ్బులు జమ అవుతాయన్నారు.

విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంచుకోవాలని కమలా విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ పి.పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా హైస్కూల్‌లో సోమవారం 7వ తరగతి విద్యార్థులకు డ్రోన్‌కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో సాంకేతిక మీద ఆధారపడే అభివృద్ధి చెందాలని డిల్లీకి చెందిన టెక్ రేడియన్స్ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డ్రోన్‌లపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పవన్‌కుమార్

ప్రతిభ చాటిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకా ఐఐటీ, జేఈఈ, నీట్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో జిల్లా స్థాయి ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలలో పదోతరగతి విభాగంలో అలకూరపాడుకు చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని భార్గవి 87 మార్కులతో ప్రథమ స్థానం లో నిలిచి రూ.5వేల నగదు అందుకుంది. దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ఎంఎండీ మాజ్ 77 మార్కులతో ద్వితీయ స్థానం రూ.3వేల నగదు, మార్కాపురం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చంద్రిక దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బాషీర్, మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రాకేష్ సంయుక్తంగా తృతీయ స్థానం పొందారు. 9వ తరగతి విభాగంలో భార్గవి రూ.10 వేలు, భవిత రూ.3వేలు, అలకూరపాడు విద్యార్థిని మధుశాలి రూ.2వేల బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో సివిల్ న్యాయాధికారి దేవేందర్‌రెడ్డి, శ్రీకా ఫౌండేషన్ ప్రిన్సిపాల్ వేదవల్లి, హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రవిశేఖర్‌రెడ్డి, రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు పొందిన విద్యార్థులు

మంచి చేతిరాతతో ప్రత్యేక గుర్తింపు

- గ్రాపాలజిస్టు తిరుపాలయ్య


గ్రాపాలజిస్టు తిరుపాలయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి). విద్యార్థులు విద్యతో పాటు చక్కని చేతిరాతను నేర్చుకోవడం వలన ప్రత్యేక గుర్తింపును పొందుతారని గ్రాపాలజిస్టు తిరుపాలయ్య తెలిపారు. మండలంలోని వేమలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గత 21 రోజులుగా విద్యార్థులకు చేతిరాతలో మెళకువలను గ్రాపాలజిస్టు తిరుపాలయ్య శిక్షణ ఇచ్చినట్లు సోమవారం తెలిపారు. మంచి చేతిరాత నేర్చుకోవడం వలన విద్యార్థులలో వారిపై వారికి మంచి నమ్మకం, ఏకాగ్రత, ఆత్మస్థైర్యం పెరుగుతాయన్నారు. దాని వలన వారి లక్ష్యాన్ని సాధించేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. గ్రాపాలజిస్టు తిరుపాలయ్యను శాలువా, పూలమాలతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 ఆంధ్రజ్యోతి: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, వివేకానంద పాఠశాలలలో వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ రేంజ్‌లో అగ్నిప్రమాదం

- తగలబడుతున్న కొండ, వన్యప్రాణులకు ప్రమాదం


తగలబడుతున్న అటవీప్రాంతం

గిద్దలూరుటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పరిధిలోని గుండ్లబ్రహ్మేశ్వరం రేంజ్ పరిధిలోని అభయారణ్యంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. నల్లమల్ల అభయారణ్యం పరిధిలోని ఆ కొండ పూర్తిగా అగ్నికి ఆహుతవుతోంది. అగ్నిప్రమాదాల నివారణకు సమీప గ్రామాల్లోని ప్రజలతో అటవీశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎటువంటి ఫలితం కనిపించడం లేదు. దీంతో వన్యప్రాణులు మృత్యు వాత పడుతున్నాయి. కొండకు వెళ్లిన వేటగాళ్లు కొండకు నిప్పు పెడుతుండడంతోనే కొండ ఆహుతవుతున్నట్లు తెలుస్తోంది. కొండలోని అటవీ సంపద కాలిపోతున్నది

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ సూచించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆప్కాస్ విధానం రద్దును నిరసిస్తూ ఈ నెల 5న మున్సిపల్ కార్మికుల చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు సోమవారం నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్, ఇమాంసా, యూసుఫ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మురికికాలువలో జారిపడి వ్యక్తి మృతి

మార్కాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మురికి కాలువలో జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో తాడి వెంకటేశ్వర్లు (39) అనే వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్సై ఎమ్.సైదుబాబు కథనం మేరకు స్థానిక జగదీశ్వరి థియేటర్ సమీపంలోని రామలక్ష్మణ వీధికి చెందిన తాడి వెంకటేశ్వర్లు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 9.00 గంటల సమయంలో ఫూటుగా మద్యం సేవించి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దత్తసాయి గుడి దగ్గర సిద్దాంతి వీధిలో సింగరి రాఘవయ్య ఇంటి ఎదురుగా ఉన్న మురికి కాలువలో జారి పడ్డాడు. సుమారు అర్ధరాత్రి 12.00 గంటల సమయంలో అటుగా వెళ్తున్న వాళ్లు గమనించి పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అక్కడకి వచ్చిన 108 సిబ్బంది వెంకటేశ్వర్లును కాలువలోంచి బయటకు తీశారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రసాద్‌రెడ్డి

కంభం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ ఫారెస్టు అధికారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా అర్ధవీడు మండలం యాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను అటవీశాఖ నిర్వహించారు. వన్యప్రాణుల పట్ల అవగాహన పెంచుకొని వాటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ అటవీశాఖకు సహకారం అందించాలన్నారు. పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పాములను ఏ విధంగా రక్షించాలో డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బీట్ అధికారులు కల్పన, ధనలక్ష్మి, స్నేక్‌క్యాచర్ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అధికారుల దృష్టి


మురుగుకాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

తర్లుపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించారు. రెండేళ్ల నుంచి మురికి కాలువలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇటీవల ప్రజలు విషజ్వరాల బారీన పడుతుండడంతో ప్రజలు ఈవో పీఆర్‌డీ సుకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సర్పంచ్ పల్లెపోగు వరాల సహకారంతో మార్కాపురం నుంచి పారిశుధ్య కార్మికులను పిలిపించి తర్లుపాడులోని ప్రధాన వీధుల్లో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామం మొత్తం కూడా మురుగు కాలువల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు పంచాయతీ కార్యదర్శి కాశంగి శ్రీనివాసులు తెలిపారు. మురుగునీరు, చెత్తను తొలగించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కుక్కల బెడదను నివారించాలని వినతి

కంభం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కంభం మండలంలో కంభం, కందులాపురం పంచాయతీలలో విచ్చలవిడిగా ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న వీధికుక్కల బెడదను నివారించాలని రాష్ట్ర షెడ్యూలు కులాల పరిరక్షన సంఘం అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు సోమవారం స్పందనలో తహసీల్దార్ కిరన్‌కు వినతిపత్రం అందచేశారు. వీధికుక్కలు విద్యార్థులపై, వృద్దులు, మహిళలు, వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. పనులపై బయటకు వెళ్ళాలంటే వీధికుక్కలకు ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని కోరారు.

పరీక్ష అట్టల పంపిణీ


విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేస్తున్న దాతలు

గిద్దలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం చోళ్లవీడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిన్ని సేవాసంస్థ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత అద్దంకి మౌలాలి, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, హెచ్‌ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివుని రథోత్సవం



మార్కాపురంలో విశేష అలంకరణలో స్వామివారు, రథం లాగుతున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్ తేజశర్మలు మార్కండేశ్వర స్వామి, జగదాంబలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి రథంపై వేంచేపు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం పట్టణంలోని నాలుగు మాడ వీధులలో శివ నామస్మరణల మధ్య ఆది దంపతుల రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తీన్మార్ తప్పెట్లు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రథోత్సవం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

తెపోత్సవానికి సర్వం సిద్ధం

పొదిలి : పట్టణంలోని నిర్మమహేశ్వరస్వామి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఎన్నో సంవత్సరాల నుండి మరుగునపడి చెత్తాచెదారంతో నిండిన కోనేరును మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఈవో నర్రా నారాయణరెడ్డి, దేవస్థాన ఛైర్మన్ వెంకటరామయ్య, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గునుపూడి భాస్కర్‌లు కోనేరును బాగుచేసి నీరు నింపేదుకు కృషి చేస్తున్నారు. పొదిలిలో ఎన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమం చేపట్టడంతో నూతన శోభను సంతరించుకోనుంది. సోమవారం కోనేటికి పూర్తిస్థాయిలో కంకర పనులు చేస్తున్నారు. పార్వతీసమేత నిర్మమహేశ్వరస్వామి తెప్పోత్సవం నిర్వహించడంతో భక్తులలో ఆనందం వెల్లివిరుస్తోంది.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

స్థానిక జవహర్ నగర్‌లో వెలసియున్న ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రధాన అర్చకులు కొడవగంటి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డా. డీవీ కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి బ్రహ్మోత్సవాలు

గిద్దలూరు : గిద్దలూరు మండలం నరవ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి చిక్కుడు శ్రీనివాసులు, దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ ఈదుల చెన్నకేశవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఆదివారం అంకురార్పణ పూజలు, 10న సూర్యవాహనం, శేషవాహనం, 11న హనుమంత వాహనం, 12న గరుడ వాహనం, 13న గజోత్సవం, 14న రథోత్సవం, 15న అస్వవాహనంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని, ప్రతిరోజు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

6న వార్షికోత్సవ వేడుకలు

గిద్దలూరు : పట్టణంలోని మహాత్మ గాంధీ విగ్రహం కూడలిలో వెలసిన శ్రీ సర్వసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 6న గురువారం 23వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 6న గురువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అనంతరం మహాగణపతి హోమం, విశేష పూజలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాతాళ నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గిద్దలూరు టౌన్ : మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు దంపతులు సోమవారం గిద్దలూరు పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నా రాంబాబు దంపతులు పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. వైసీపీ ముఖ్యనాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.




కోనేటి పనులు చేయిస్తున్న గునుపూడి భాస్కర్, మార్కాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు, పూజలు చేస్తున్న అన్నారాంబాబు

ముఖాముఖి

పొదుపు సంఘాలకు విరివిగా రుణాలు

ఎం.హనుమంతరావు, ఏపీఎం, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో ఎన్ని పొదుపు సంఘాలు ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని సంఘాలకు రుణాలు ఇచ్చారు?

జవాబు: మండలంలో 1480 పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిలో 1100 సంఘాలకు రుణాలు ఇచ్చాం. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.50 కోట్లు రుణాలు అందజేశాం.

ప్ర: మహిళా సంఘాల బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జ: ఉల్లాస్ ప్రోగ్రాం కింద మహిళా గ్రూపు సంఘ సభ్యురాళ్ళకు అక్షరాస్యత కింద ప్రోగ్రాం నిర్వహించి వారిని చైతన్య పరిచాం.

ప్ర: మహిళలకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారు?

జ: డ్వాక్రా సంఘంలో ఉన్న ప్రతిమహిళను లక్షాధికారి చేయటమే లక్ష్యం. అందుకోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి పథకాన్ని వారి చెంతకు తీసుకు వెళ్ళి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం.

ప్ర: తీసుకున్న రుణాలు తిరిగి సక్రమంగా చెల్లిస్తున్నారా?

జ: సంఘ సభ్యురాళ్ళు తీసుకున్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లిస్తున్నారు. మండలంలో 96 శాతం రికవరీ ఉంది.

ప్ర: సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: మండలంలో పొదుపు సంఘాలు ఎక్కువగా ఉన్నాయి. సీసీలు ఇద్దరు మాత్రమే ఉన్నారు. మరో ఇద్దరు అవసరం ఉంది.

కొండపై నుంచి జారిపడి కణితి మృతి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన లో అరుదైన అడవి కణితి ప్రమాదశాత్తు కొండచరియ మీద నుంచి జారి జలపాతంలో పడి మృతి చెందింది. అడవిలో సంచరించే అరుదైన అడవి కణతి నీటికోసం కొండ చరియ నుంచి ప్రాకుతూ ప్రమాదశాత్తు జారి జలపాతంలో పడిపోవడంతో మృతి చెందింది. సమాచారం అందుకొన్న అటవీశాఖ సిబ్బంది మృతి చెందిన కణతిని పరిశీలించారు. అటవీశాఖ సిబ్బంది అలీమ్ ఫిర్యాదు మేరకు డీజీపేట పశువైద్యాధికారి షేక్ మునీర్ సిబ్బంది రాజేష్, ఆదినారాయణచే పోస్టుమార్టం నిర్వహించారు. పంచనామా అనంతరం ఖననం చేశారు.

శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కదిరి బాబురావు విద్యా సంస్థల సొంత నిధులతో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహాన్ని కరస్పాండెంట్ పార్థసారధి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఇంటర్ పరీక్షలను శ్రద్ధగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతయ్య, వెంకటరామయ్య, రవిబాబు, కొండయ్య, మాజీ ఎంపీటీసీ మునగాల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు సాయం

పామూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్న డి.శంకర్ కాలేయం సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి వైద్య అవసరాల కోసం వగ్గంపల్లి పంచాయతి కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పారా వెంకటేశ్వర్లు తన వంతుగా రూ.2,116 ఆ పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లుకు పార్టీ కార్యాలంయలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, షేక్ ఖాజా రహంతుల్లా, పత్తు మస్తాన్ పాల్గొన్నారు.

6న రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

సీఎస్‌పురం(పామూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని కోరుతూ నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించి డీటీ వెంకటేశ్వర్లుకు ఏపీ రైతు సంఘం నాయకులు ఏ.వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి సోమవారం ధర్నా నోటీసు అందజేశారు. కార్యాలయంలో జరిగే అవినీతి అక్రమాలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ధర్నా నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. పదో తేదీన కనిగిరి ఆర్డీవో కార్యాలయం వద్ద, 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. తదనంతరం కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

రేపు తాళ్లూరులో సమావేశం

తాళ్లూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి ఆదేశాల మేరకు ఆదరణ పథకం కింద రుణాలు మంజూరు చేసేందుకు ఈనెల 5న కులవృత్తులపై తాళ్లూరులో మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దారాహనుమంతరావు సోమవారం తెలిపారు. ఆధునిక పనిముట్ల నాణ్యత, కంపెనీల ఏజెన్సీ వివరాల సేకరణకు కుల వృత్తి సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

కనిగిరిని ఆదుకోండి..!



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యల ప్రస్తావన

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గం క్షామంతో అల్లాడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో తన గళం వినిపించారు. కనిగిరి ప్రాంతంలో వర్షాలు తక్కువగా పడుతుంటాయన్నారు. ఈప్రాంత రైతులు కేవలం బోర్ల నీటితోనే పంటలను పండించుకునే దుస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కనిగిరి నియోజకవర్గంలో గృహ కనెక్షన్‌లు లక్ష వరకు ఉండగా, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు 35వేల వరకు ఉన్నాయన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలతో దాదాపు 329 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరంతా విద్యుత్ కనెక్షన్‌ల కోసం నిరీక్షిస్తున్నారని చెప్పారు. కనెక్షన్ కోసం నగదు చెల్లించినా ఇవ్వటం లేదన్నారు. ఎలాంటి అనుమతులు లేని అనధికార వెంచర్లకు మాత్రం విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు మాత్రం ఆశాఖాధికారులు అమితశ్రద్ధ చూపుతుంటారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలోని రాగి తీగను దొంగలు ఎత్తుకెళితే సమస్యను పరిష్కరించి చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్ అధికారులు పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్ తీసుకురావాలని ఆంక్షలు పెడుతు న్నారన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్ కాలిపోతే రైతులు ఎఫ్ఐఆర్ కోసం ప్రదక్షిణలు చేయటం ఎంత వరకు సబబు అని అన్నారు. కనిగిరి ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమస్య నుంచి ప్రజలను విముక్తి చేయడానికి ఆర్‌వో ప్లాంట్‌లను సబ్సిడీపై మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

- కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు


వెలవెలబోతున్న దర్శి ఆర్టీసీ బస్టాండ్


తలుపులులేని టాయిలెట్ గదులు


నిరుపయోగంగా మంచినీటి కొళాయిలు

దర్శి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్టాండ్ నిర్వాహణ సక్రమంగా లేక అస్తవ్యస్తంగా తయారైంది. కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు అధికశాతం బస్టాండ్‌కు రావటంలేదు. దీంతో ప్రయాణికుల సంఖ్య కూడా తగ్గిపోయి వెలవెలబోతుంది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి సుమారు 25 ఏళ్ల గడిచినప్పటికీ నేటి వరకు ప్రహరీగోడ ఏర్పాటుచేయలేదు. టాయిలెట్ గదుల తలుపులు ఎంతోకాలంగా విరిగిపోయినప్పటికీ పట్టించుకున్న నాధుడులేదు. మంచినీటి సౌకర్యం లేదు. కొళాయిలు తుప్పుపట్టిపోతున్నాయి. ఆకతాయిలు బస్టాండ్ ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలకు అసౌకర్యంగా ఉంది. ఎన్నో సంవత్సరాలుగా ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ అధ్వానంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి గురించి పట్టించుకోకపోవటంతో ఆర్టీసీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ వెళ్లే అధికశాతం బస్సులు బస్టాండ్‌కు వెళ్లటంలేదు. దీంతో ప్రయాణికులకు ఎక్కడ వేచిఉండాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాడ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, అన్నీ బస్సులు బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

దొనకొండలో దాహం.. దాహం

- ఒబ్బాపురానికి 15 రోజులుగా సరఫరాకాని సాగర్ జలాలు
- స్టోరేజీలో సమృద్ధిగా ఉన్నా తప్పని సమస్య
- నీటి సంపు పరిశుభ్రతను పట్టించుకోని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఒబ్బాపురంలో అధ్వానంగా తయారైన నీటిసంపు

దొనకొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ప్రధానంగా ఒబ్బాపురం పరిధిలోని ప్రజలు పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. దాదాపు 15 రోజులుగా సాగర్ జలాలు సరఫరా కాకపోవటంతో గుక్కెడు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొనకొండ ప్రజల దాహార్తి నిమిత్తం నిర్మించిన చందవరం-1 స్టోరేజీలో సమృద్ధిగా సాగర్ జలాలు ఉన్నాయి. అయినా 15 రోజులుగా నీటి సరఫరా జరగటం లేదని ఒబ్బాపురం ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొనకొండలోని మిగిలిన ప్రాంతాల్లో నాలుగు రొజులకొకసారి సాగర్ జలాలు సరఫరా జరుగుతున్నా ఒబ్బాపురం ప్రాంతానికి 15 రోజులకు కూడా రావడంలేదు. నీటి సరఫరా గురించి సిబ్బందిని ప్రశ్నిస్తే పైపులైన్ పగిలిందని, సంప్‌కు నీరు చేరటం లేదనే సమాధానం చెబుతున్నారని ఆప్రాంతవాసులు పేర్కొన్నారు. పైప్‌లైన్ పగిలితే మరమ్మతులు వెంటనే చేయించి నీటి సరఫరా చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే తమకు నీటి కష్టాలు ఎదురైతే రానున్న మూడు నెలల వేసవిలో నీటి కష్టాలను తలచుకుంటే భయమేస్తుందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఒబ్బాపురంలో నిర్మించిన నీటి సంపు పురాతనమై నిర్వహణకు నోచుకోక అపరిశుభ్రంగా మారింది. దీంతో నీటి సరఫరా జరిగిన సమయంలో తమకు స్వచ్ఛమైన సాగర్ నీరు అందటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సంపునకు మూతలేకపోవటంతో వీధికుక్కలు సంపుపైకి ఎక్కి తిరుగుతూ తరచూ సంపులో కుక్కలు పడి అరుస్తుండటంతో స్థానికులు వ్యయప్రయాసలకు గురై వాటిని బయటకు తీసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఒబ్బాపురం ప్రజలు మంచినీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి, అధ్వానంగా తయారైన నీటి సంపు నిర్వహణ చేపట్టి స్వచ్ఛమైన సాగర్ జలాలు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మూడు పాఠశాలలు జడ్పీ హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్



జడ్పీహైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కానున్న వెలుగువారిపాలెం స్కూల్

తాళ్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు యూపీ స్కూళ్లను జిల్లా పరిషత్ హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ, ఒక యూపీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మారుస్తూ జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపగా ఆమోదించారు. నూతన విద్యావిధానంలో భాగంగా 1 నుంచి 2వ తరగతి వరకు ఫౌండేషన్ పాఠశాలలు 12, 1నుంచి 5వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలలు 14, 1నుంచి 5వరకు బేసిక్ ప్రాథమిక పాఠశాలు 14 ఏర్పాటుకు ఆమోదం లభించింది. మండలంలోని మల్కాపురం, వెలుగువారిపాలెం, తురకపాలెం యూపీ పాఠశాలను జిల్లాపరిషత్ హైస్కూళ్లగా ఏర్పాటుచేస్తున్నారు. మాధవరం యూపీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్పుచేశారు. ప్రస్తుతం మండలంలో తాళ్లూరులో ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉంది. శివరాంపురం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, లక్కవరం గ్రామాల్లో జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. మల్కాపురం, తురకపాలెం, వెలుగువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా మార్చటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చలానాల మోత

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


పీసీపల్లిలో హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుపరిచేందుకు పోలీసులు నడుం బిగించారు. అందులోభాగంగా నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకులకు భారీగా జరిమానాలు విధించేందుకు సిద్ధమయ్యారు. ప్రజలకు అవగాహన కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు తమ దగ్గర డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించి సీబుక్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కాగితాలు తప్పనిసరిగా ఉండాలి.

హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే రూ. వెయ్యి, వెనకాల కూర్చున్న రెండో వ్యక్తికి కూడా రూ. వెయ్యి జరిమానా విధిస్తారు. ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి రూ.2 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.4వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేలు జరిమానా విధిస్తున్నారు. పొల్యూషన్ ధ్రువపత్రం లేకపోతే రూ.15 వందలు, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపితే మొదటిసారి రూ.15 వందలు, రెండోసారి రూ.10వేలు, రిజిస్ట్రేషన్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండోసారి రూ.5వేలు జరిమానా విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై కోటయ్య తన సిబ్బందితో మండలంలోని గ్రామాలను సందర్శించి వాహన చట్టం నిబంధనలు పాటించకపోతే భారీగా చలనాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎస్సైతో పాటు సిబ్బంది హెల్మెట్‌లు ధరించి ద్విచక్ర వాహనాలతో గ్రామాలను సందర్శిస్తూ హెల్మెట్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అద్దంకి నుంచి ద్విచక్ర వాహనంపై చింతలపూడికి దాసరి నాగేశ్వరరావు, అతని భార్య నాగేశ్వరమ్మ వెళుతున్నారు. అదేసమయంలో తమ్మలూరు గ్రామానికి చెందిన చొప్పరపు బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తున్నాడు. ఈక్రమంలో వేంపాడు సమీపంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటంతో నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా, బ్రహ్మయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. నాగేశ్వరరావును అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బ్రహ్మయ్య అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

- దొరికిన ల్యాప్‌ట్యాప్ స్టేషన్‌లో అప్పగింత

పామూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్ జంక్షన్ వద్ద సోమవారం దొరికిన ల్యాప్‌ట్యాప్ బ్యాగును ఆటోడ్రైవర్ ఎస్ఐకి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పామూరుకు చెందిన లక్కనబోయిన నారాయణ అనే ఆటోడ్రైవర్ నెల్లూరు రోడ్ నుంచి ఆటో నడుపుకొంటు వస్తున్నారు. ఈక్రమంలో విరాట్‌నగర్ జంక్షన్ వద్ద రోడ్డుపక్కన పడిఉన్న బ్యాగును గమనించాడు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి బ్యాగును పోగొట్టుకొని ఉంటాడని భావించిన ఆటో డ్రైవర్ తనకు దొరికిన బ్యాగును పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి అప్పగించాడు. బ్యాగులో ల్యాప్‌ట్యాప్ ఉందని పోలీసులు గుర్తించారు. ఆటోడ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు. ఎవరైన ఆప్రాంతంలో బ్యాగు పోగొట్టుకొని ఉంటే సంబంధిత ఆధారాలు తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ .లక్షా 59 వేలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు సమర్పించుకొన్న కానుకుల హుండీ ద్వారా రూ.1,59,150 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.48,830, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,760, అన్నదానానికి విరాళాల ద్వారా రూ.82,044, పంచామృత అభిషేకాలకు రూ.5,516 లు వచ్చినట్లు తెలిపారు. అన్నదానానికి గూడూరుకు చెందిన మంచికంటి పుల్లయ్య, విజయలక్ష్మీ దంపతులు రూ.44,116 అందించిన నగదును పామూరుకు చెందిన మంచికంటి మధుసూదన్‌రావు చేతుల మీదుగా ఈవోకు అందజేశారు.

మోదేపల్లి మేజరుపై వారబందీ

ముండ్లమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి, జమ్మలమడక మేజర్ల పరిధిలో కాలువలకు మంగళవారం నుంచి వారాబందీ విధానం అమలుచేస్తున్నట్టు ఎన్ఎస్‌పీడీ డీఈ బి.పూర్ణచందు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా నూజెండ్ల మండల పరిధిలోని డీఈలు, జేఈలు, డీసీ చైర్మన్‌లు, మోదేపల్లి డీఈ, జేఈలు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులతో రొవ్వారంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇరు జిల్లాల అధికారులు ఒప్పందం కుదుర్చుకొని నాలుగు రోజుల పాటు ఒక మేజరుకు, మరో నాలుగు రోజులు మరో మేజరుకు నీరు విడుదల చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

మంగళారం నుంచి జమ్మలమడక మేజరు పరిధిలో నాలుగు రోజుల పాటు నీటిని పంపిణీ చేయనున్నారు. మిగతా నాలుగు రోజులు మోదేపల్లి మేజరు పరిధిలోని కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. సమావేశంలో డీఈలు పూర్ణచందు, వెంకట నారాయణ, ప్రసన్న కుమార్, కేశవయ్య, టి.ప్రసాద్, సత్యనారాయణ, మోదేపల్లి డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఉన్న పరిపూర్ణయ్య, కంచుమాటి నాగేశ్వరరావు, బొప్పుడి వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించాలి

దర్శి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా బడ్జెట్‌లో రూ.2వేలు కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దర్శి పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కంటి తుడుపుగా రూ.309 కోట్లు కేటాయించటం దారుణమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం రూ.2వేల కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టిరంగారావు, యు. నారాయణ, ఎస్‌కే బాషా, జాన్ సామ్యేల్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లూరులో ట్రాక్టర్ల పంపిణీ

తాళ్లూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా నాలుగు గ్రామపంచాయతీలకు మంజూరైన చెత్త తరలింపు ట్రాక్టర్లను మంగళవారం పంపిణీ చేస్తారు. వీటిని తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేస్తారని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, తెలిపారు. స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా మండలంలోని శివరాంపురం, లక్కవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు గ్రామాల్లో చెత్త తరలింపునకు ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి కోరారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

పామూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విరాట్ నగర్‌లోగల అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడంవల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం బాలికలతో ప్రమాణం చేయించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలి

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకుడు కేశవరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించటంతో పాటు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కార్మికులకు వారాంతపు సెలవులు అమలుచేయాలన్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, లక్ష్మయ్య, ఓబయ్య, జాన్సన్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ బాధితులకు పరిహారం ఇవ్వాలి


కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ బాధితులను న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు పీవీ శేషయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ సమీపంలోని పేరంగుడిపల్లి కొత్తపల్లి వద్ద వచ్చే రైల్వేలైన్ కారణంగా దాదాపు ఏడు గృహాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. 25ఏళ్ళుగా జీవిస్తున్న కుటుంబాలను అర్థంతరంగా ఖాళీ చేయాలని, కూలదోస్తామని ఆందోళనకు గురిచేయటం సరైన పద్ధతి కాదన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

దొనకొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం దొనకొండ పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు వివాహలు చేయకూడదన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం అందించాలన్నారు. ఆడపిల్లలకు 18 సంవర్సాలు నిండే వరకు వివాహం చేయకూడదని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు లలితకుమారీ, పి.ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

తాళ్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాలెంలో ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూమిని అక్రమంగా దున్ని కులంపేరుతో దూషించినవారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. ఈఘటనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులోని ఎడ్ల మల్లయ్య, అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఎస్టీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సోమవారం దర్శిలో డీఎస్పీని బాధితులు కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో దళిత నాయకులు కాకుమాను రవి, వేము బాలమ్మ, ఇట్టా రూతమ్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





పెదరావూరు లేఅవుట్



గుంటూరు ఏసీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

పట్టభద్రుల పోరులో.. టీడీపీ దూకుడు


గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు(తెలుగుదేశం) ఘన విజయం దిశగా దూసుకుపోతున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఈ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. స్ట్రాంగ్‌రూంల సీళ్లను అభ్యర్థులు, ఏజంట్ల సమక్షంలో తెరిచి బ్యాలెట్ బాక్సులను భద్రంగా కౌంటింగ్ హాల్‌లోకి చేర్చారు. అనంతరం ఏజంట్ల సమక్షంలో సీళ్ల తెరిచి బ్యాలెట్ పేపర్లను మిశ్రమం చేశారు. ఆ తర్వాత 50 చొప్పున కట్టలు కట్టారు. ఆర్‌వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా తెరిచారు. మొత్తం 371 పోస్టల్ బ్యాలెట్లకు 55 చెల్లుబాటు కాలేదు. దాంతో 316 బ్యాలెట్లను తొలి రౌండ్ కౌంటింగ్‌లోకి తీసుకొచ్చారు. మొత్తం పోలింగ్ అయిన 2,41,493 ఓట్లను 50 చొప్పున 4,828 బండిల్స్(కట్టలు)గా చేశారు. మిగిలిన 93 ఓట్లతో మరో కట్ట కట్టారు. కౌంటింగ్ హాల్‌లో 28 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌పైకి ఒక్కో రౌండ్‌లో 1000 ఓట్లను లెక్కింపునకు పంపారు. కౌంటింగ్ సిబ్బంది ఒక్కో కట్ట తెరిచి బ్యాలెట్ పేపర్‌ని ఏజంట్లకు చూపిస్తూ చెల్లుబాటు కాకపోతే ప్రత్యేకంగా ట్రేలో పడేసి చెల్లుబాటు అయిన తొలి ప్రాధాన్య ఓట్లను అభ్యర్థుల వారీగా వారికి కేటాయించిన ట్రేలలో అమర్చారు.

తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం

ఆలపాటి రాజేంద్రప్రసాదుకు తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం లభించింది. అన్ని టేబుళ్లపైనా ఆయనకు మెజార్టీ వచ్చింది. దాంతో తొలి రౌండ్‌లో 17,194 ఓట్లు ఆలపాటికి రాగా లక్ష్మణరావుకు 7214 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 3070గా ఉన్నాయి. తొలి రౌండ్‌లో 28,312 ఓట్లు లెక్కించారు. రెండో రౌండ్‌లో ఆలపాటికి 17527 ఓట్లు, లక్ష్మణరావుకు 6742 ఓట్లు వచ్చాయి. ఈ రౌండ్ లోనూ చెల్లని ఓట్లు 3005 ఉన్నాయి. దీంతో ఆలపాటి మెజార్టీ 20765కు చేరుకొన్నది. మూడో రౌండ్‌లోనూ ఆలపాటి హవా కొనసాగింది. ఈ రౌండ్‌లో ఆలపాటికి 16,722 ఓట్లు రాగా, లక్ష్మణరావుకు 7404 ఓట్లు వచ్చాయి. 2978 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నాల్గో రౌండ్‌లో ఆలపాటికి 16236 ఓట్లు, లక్ష్మణరావుకు 7828 ఓట్లు రాగా 3035 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నాల్గో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి మెజార్టీ 38,491కి చేరింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదు తన రాజకీయ అనుభవాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగరించారు. ఎవరూ ఊహించనంతగా తొలి ప్రాధాన్య ఓట్లు తనకు వేసేలా పట్టభద్రుల్లో చైతన్యం నింపారు. ఏ బ్యాలెట్ బాక్సు తెరిచి ఓట్ల లెక్కింపు ప్రారంభించినా కౌంటింగ్ హాల్ అంతా ఆలపాటి పేరే వినిపించింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేసరికే దాదాపుగా 10 వేల మెజార్టీ లభించడంతో అక్కడే రాజా విజయం ఏ స్థాయిలో ఉండబోతుందో చెప్పకనే చెప్పినట్లు అయింది. అది మొదలుకొని ప్రతీ రౌండ్‌లోనూ ఆయన హవా కొనసాగింది. నాల్గో రౌండ్ కౌంటింగ్ ముగిసేసరికే ఆలపాటికి సమీప ప్రత్యర్థి అయిన సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కౌంటింగ్ హాల్‌ని విడిచి వెళ్లిపోయారు.

పక్కా ప్రణాళికతో ఓట్ల లెక్కింపు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల (మిగతా 8వ పేజీలో)



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.29 (మంగళవారం)
సహరి : 5.10 (బుధవారం)

ధ్రువీకరణ పత్రం నకిలీ సిత్రం

- దొంగ పత్రాలతో ప్రభుత్వ భూమి హాంఫట్!
- అవే అధికారిక పట్టాలుగా భూ ఆక్రమణ
- గత ప్రభుత్వ కాలంలో గుట్టుచప్పుడు కాకుండా భూ దందా
- ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగులోకి
- ఏ స్థాయిలో ఉందనేది విచారణలో తేలాల్సిందే
- పోలీస్ కేసు పెట్టే ఆలోచనలో రెవెన్యూ అధికారులు !

అదొక ధ్రువపత్రం మాత్రమే. దానినే ప్రభుత్వ పట్టాగా చలామణి చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములలో పాగా వేసేశారు. అది ఇంతటితో ఆగకుండా జగనన్న కాలనీల కోసం కేటాయించిన స్థలాలనే కబ్జా చేసేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఒక్క సెంటు మాత్రమే జాగా ఇస్తే, వీరు ఈ పత్రాలతో ఏకంగా రెండు సెంట్ల చొప్పున సొంతం చేసుకున్నారు. తెనాలిలో ఆలస్యంగా బయటపడిన నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం రెవెన్యూ శాఖను ఉలిక్కిపడేలా చేసింది. ఇదే తరహాలో ఒక మురా భూమికి విలువ ఎక్కువగా ఉన్న పట్టణాలు, రాజధాని ప్రాంతాల్లో ఈ తరహా నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తే, అది ఎంత విస్తీర్ణం? ఎంతమంది అక్రమార్కులు దీని వెనుక దాగున్నారనేది అంతు బట్టని విషయం. పట్టా లేకున్నా కనీసం ఏదో ఒక అధికారిక ధ్రువ పత్రం ఉంది కదా! అని సరిపెట్టుకుందామంటే, అదికూడా అసలు కాదు... అచ్చుగుద్దినట్టు అసలుకు నకిలీని దింపేశారు. ఇక్కడ వీరు చేసిన తప్పేంటంటే!... ప్రతి ప్రభుత్వ ఉత్తర్వులకు కానీ, ధ్రువపత్రాలకు కానీ సంబంధిత రికార్డు నంబర్ ఉంటుంది. ఆ ఒక్క విషయాన్ని మర్చిపోయి ఏ నంబర్ కానీ కనీసం తేదీ కూడా లేకుండా తయారు చేయటమే. అదే ఈ నకిలీ పత్రాల కుంభ'కోణాన్ని' గుర్తించటానికి ఆధారమయింది. పైగా ఈ ధ్రువపత్రంలో గౌరవ శాసనసభ్యునికి అర్జీ పెట్టుకున్నారని, అందుకే స్థలాన్ని కేటాయించినట్టు పేర్కొనటం కూడా నకిలీ గుట్టు రట్టు చేసింది. అధికారానికో! లేక డబ్బుకో తలూపే అధికారులుంటే చిత్తుకాగితం కూడా హక్కు పత్రమైపోతుందనటానికిదో ఉదాహరణ. దీని ఆధారంగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవటం కొసమెరుపైతే, వాటిలో పాగా వేసిన వారి గురించి రెవెన్యూ శాఖ అసలు పట్టించుకోకపోవటం మరో విశేషం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారం బయటకు పొక్కటంతో దీని మూలాలను ఛేదించే పనిలో పడ్డారు.

తెనాలి, మార్చి 03, (ఆంధ్రజ్యోతి): ఒక చిత్తు కాగితం ఇక్కడ అధికారిక ధ్రువపత్రం అయిపోయింది. దీని ఆధారంగానే ప్రభుత్వ భూములను, జగనన్న కాలనీల్లోని స్థలాలను అధికారులు కట్టబెట్టారో! లేక అక్రమార్కులే దోచేశారో కానీ కబ్జాల పర్వం మాత్రం యథేచ్ఛగా సాగిపోయింది. సాధారణంగా ఒక ప్రభుత్వ భూమిని వ్యక్తులకు కానీ, లేక ప్రైవేటు సంస్థలకు కానీ కేటాయించాలంటే 2012లో విడుదల చేసిన జీఓ నంబర్ 571 ప్రకారం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలి. ఇదంతా తహసీల్దార్, సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపాలి. చిన్నపాటి స్థలాలు కాకుండా రూ. 50 లక్షల విలువకు మించిన భూమి అయితే దానికి క్యాబినెట్ అనుమతి ఉండాలి. అయితే తెనాలిలో అవేమీ లేకుండా కేవలం ఒక ధ్రువీకరణ పత్రం పేరుతో స్థలాల హద్దులు చూపించిమరీ అప్పనంగా అప్పగించేశారు. ఇంతటి పక్కా హద్దులతో స్థలాలు కేటాయించారంటే, దీని వెనుక రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల పాత్ర ఎంతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. తెనాలిలో గత తహసీల్దార్‌ల కాలంలో జరిగాయా! లేక తహసీల్దార్‌ల బదిలీ జరిగిన (మిగతా 8వ పేజీలో)



పట్టా అంటూ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేసి, స్థలాలను అప్పనంగా దోచేసిన అక్రమార్కులు



బల్లికురవ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనుల మస్టర్లపై విచారణ జరుపుతున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం

బోగస్ మస్టర్లపై విచారణ


గ్రామ సహాయకులతో మాట్లాడిన విజిలెన్స్ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన

బల్లికురవ. మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వలస కూలీలకు ఇబ్బందులు లేకుండా గ్రామాలలోనే కట్టుదిట్టంగా ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఉపాధి హామీ పథకం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీహర్ష తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఉపాధి హామీ పనులలో బోగస్ మస్టర్లు వేసేందుకు అధికారులు గ్రామాల క్షేత్ర సహాయకులపై ఒత్తిడి తెస్తున్నారని వచ్చిన వరుస కథనాల మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారుల బృందం మండలంలో విచారణ చేపట్టారు. సంతమాగులూరు మండలంలో విచారణ జరిపింది. అనంతరం బల్లికురవ ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాలకు చెందిన క్షేత్ర సహాయకులను విడి విడిగా విచారణ జరిపారు. ఎవరైనా మస్టరు వేయాలని అడుగుతున్నారా, సిబ్బంది ఒత్తిడి ఏమైనా ఉందా అన్న వివరాలను వారు సేకరించారు. పనులలో లోపాలు ఏవైనా జరుగుతున్నాయా అని వారు ప్రశ్నించారు. అలానే ఆడిట్‌లు ఎలా జరుగుతున్నాయని వారు ఆరా తీశారు. తాము కొత్తగా విధుల్లోకి వచ్చామని కొందరు క్షేత్ర సహాయకులు వారికి తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనులలో అవకతవకలు లేకుండా కూలీలకు ఫోటోలు తీసే ప్రక్రియ ఉందని ఎక్కడైన లోపాలు ఉంటే కూలీలు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేయాలన్నారు. తాము తరచూ పనులను పరిశీలిస్తామని, ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు పత్రికలలో వార్తలు వస్తే విచారణ చేసి కూలీలకు న్యాయం చేస్తామని వారు తెలిపారు. ఈ విచారణలో రాష్ట్ర విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ డీఈ శాంతారావు పాల్గొన్నారు.

‘ఫాం7’ దొంగలపై సిట్ అస్త్రం

- పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల అవకతవకలపై ప్రభుత్వం కన్నెర్ర
- ఎమ్మెల్యే ఏలూరి ఫిర్యాదుతో సిట్ ఏర్పాటు
- ప్రకాశం జిల్లా ఎస్పీ సారథ్యంలో విచారణ



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు పర్చూ రు నియోజకవర్గం వేదికగా పెద్ద ఎత్తున ఫాం-7 కుట్రలకు తెరలేపిన సంగతి తెలిసిందే. ఏకంగా పోలీసు శాఖను వాడుకునే ఈ తతంగం అంతా నడిపించింది. బతికుండగానే వేల మంది టీడీపీ అనుకూల ఓటర్లను చనిపోయినట్లుగా ఫాం-7లు దరఖాస్తు చేయించింది. ఈ అక్రమాలపై అప్పుడు కూడా పర్చూరు నుంచే ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న ఏలూరి సాంబశివరావు గోడు అరణ్య రోదనే అయింది. పదేపదే అప్పటి వైసీపీ ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లినా ఫాం-7 దొంగలకే కొమ్ము కాసింది. ఆ తర్వాత మొక్కుబడిగా కొన్ని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంది. పర్చూరు నియోజకవర్గంలో దాదాపు 195 మంది వైసీపీ మ ద్దతుదారులు ఫాం-7లను గంపగుత్తగా దరఖాస్తు చేసి 24,000 ఓట్లను తొలగించడంలో సఫలీకృత మయ్యారు. కేవలం 12 మందిపై మాత్రమే కేసుల ను అప్పటి ప్రభుత్వం నమోదు చేసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ ఓట్ల తొలగింపు భాగో తంపై విచారణ జరపాలని అప్పట్లోనే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ముందు తన సచ్ఛీలత నిరూపించుకునేందుకే మొక్కుబడిగా ఆ 12 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని అప్పట్లో బలమైన విమర్శలు వచ్చాయి. నిబంధలనను ఉల్లంఘించి ఫాం-7 దొంగలకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపైనా ఈసీ చర్యలు తీసుకుంది. బీఎల్‌వోలుగా విధులు నిర్వహించిన మహిళా పోలీసులు కూడా ఈ ఓట్ల తొలగింపుపర్వంలో భాగస్వాములయ్యారు.

యథేచ్ఛగా కొనసాగిన ఈ తొలగింపుపర్వంపై అప్పట్లో టీడీపీ నేతలు చేసిన పోరాటం పట్టించుకోకుండా, ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగా వైసీపీ వేధింపులకు తెరతీసింది. అప్పట్లో పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ పూర్తిగా అధికారం అండతో ఎలాగైనా పర్చూరులో నెగ్గాలనే ఉద్దేశంతో ఈ ఓట్ల తొలగింపులో కర్త, కర్మ, క్రియ అన్నీ తానై వ్యవహరించారు. ఈ లోపు ఎన్నికలు రావడం, టీడీపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. పర్చూరు నియోజకవర్గంలో 24,000 ఓట్లు తొలగించినా సరే దాదాపు 23,000 మెజార్టీతో తిరిగి ఏలూరి సాంబశివరావు గెలవడంతో కంగు తినడం వైసీపీ వంతైంది.

ఓట్ల దొంగలపై విచారణ జరపడానికి సిట్ వేయా లని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. దాని ఆధారంగా ప్రభుత్వం ఓట్ల తొలగింపు అవకతవకలపై విచారణ జరిపేందుకు సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది

ప్రకాశం జిల్లా ఎస్పీ సారథ్యంలో....

ప్రభుత్వం నియమించిన సిట్ బృందానికి ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్‌ను హెడ్‌గా, వెస్ట్ గుంటూరు డీఎస్పీ అరవింద్‌ను సభ్యుడిగా నియమించింది. ఈ బృందం సీఐడీ డీజీపీ నియంత్రణలో పనిచేయనుంది. డీజీపీ కోరిక మేరకు మరో అధికారిని సభ్యుడిగా నియమించుకునే వెసులుబాటును ఉత్తర్వులో పేర్కొంటూ ఆదేశాలిచ్చింది

సహాయసహకారాలు అందించాలి...

సిట్ బృందానికి అవసరమైన అన్ని సహాయసహకారాలను అందించాలని బాపట్ల జిల్లా ఎస్పీని ప్రభుత్వం ఆదేశించింది. దర్యాప్తు క్రమాన్ని ప్రతి మూడు నెలల కొకసారి సిట్ బృందం ఈసీకి అందించనుంది. ఈ క్రమంలో అవసరమైన డాక్యుమెంట్లను సీజ్ చేసే అధికారం, సాక్షులను విచారణ చేపట్టడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకునే అధికారాన్ని సిట్‌కు ప్రభుత్వం కట్టబెట్టింది.




చీరాలలోని ఓ పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

బాపట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్ పి. యర్రయ్య పర్యవేక్షించారు. రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు,రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షల నిర్వాహణను పరిశీలించారు. జనరల్ విద్యార్థులు 7,845మందికి 7,623 మంది పరీక్షకు హాజరయ్యారు. 222మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 393మందికి 381 మంది హాజరవగా 12 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 8,238కి గాను 8004 మంది హాజరు కాగా 234మంది గైర్హాజరైనట్లు యర్రయ్య తెలిపారు. బందోబస్తును అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. 144వ సెక్షన్ అమలు చేశారు.

తవ్వారు... వదిలేశారు

వేమూరు- చావలి రోడ్డుపై నిత్యం నరకమే..



తవ్వి వదిలేసిన చావలి ఆర్‌అండ్‌బీ రోడ్డు

వేమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండలం వేమూరు నుండి చావలి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును మూడు మాసాల క్రితం రోడ్డు పునర్నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహన చోద కులు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ నిధులు రూ.80 లక్షలు మంజూరు అయ్యాయి. టెండర్ ద్వారా కాంట్రాక్టు పిలిచి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి, తర్వాత నిర్మాణ పనిని ప్రారంభించకుండా వదిలేశారు.

దీనిపై ఆర్ అండ్ బీ శాఖ ఏఈ విద్యాసాగర్‌ను వివరణ కోరగా మైనింగ్ శాఖ నుండి కంకర సరఫరా చేయడంలో జాప్యం జరిగిందన్నారు. ప్రభుత్వ పనులకు టోకెన్స్ మంజూరు కావాల్సి ఉందని, వాటి జాప్యం వల్లనే కాంట్రాక్టర్ వెంటనే పనిని ప్రారంభించలేక పోయారన్నారు. నెలాఖరులోగా టోకెన్స్ మంజూరు అయ్యే అవకాశం ఉన్నదని పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

జీడీసీసీపై.. ఆర్బీఐ కొరడా

- రూ. 50 వేలు పెనాల్టీ విధింపు
- ఫైన్ పడితే రానున్న రెండేళ్లు బ్యాంకుకు కష్టకాలమే
- 2022-23 బ్యాలెన్స్ షీట్ ప్రచురించటంలో విఫలం

గుంటూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు (జీడీసీసీ) కోలుకోలేని దెబ్బ తగిలింది. బ్యాంకు విధి విధానాలపై ఆర్బీఐ(రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా)కన్నెర్ర చేసింది. రూ. 50 వేలు పెనా ల్టీ విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. 2022-2023 ఆర్థిక సం వత్సరానికి సంబంధించిన ఖాతాలు, బ్యాలెన్స్ షీట్‌ను ప్రచు రించడంలో బ్యాంక్ విఫలమైనందున ఈ చర్యలకు ఉపక్రమిం చింది. 2022-23 సంవత్సరాల్లోనే జీడీసీసీ బ్యాంకు వేదికగా రు ణాల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యం లోనే బ్యాలెన్స్ షీట్ దాఖలు చేసేందుకు బ్యాంకు అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఖాతాల వివరాలు వెల్లడిస్తే నకిలీ భాగోతాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే గోప్యత పాటించినట్లు అర్థం అవుతుంది. నకిలీ ఆధార్ కార్డులతో, ఈ-కేవైసీతో సంబంధం లేకుండా కోట్ల రూపాయలను వైసీపీ నేతలు కొల్లగొట్టారు. ప్రత్తిపాడుతో పాటు జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు జరిగాయి. మొత్తం రుణ మాఫియాలో 184 మంది రైతులు, 21 మంది జీడీసీసీ మేనేజర్‌లు, అసిస్టెంట్ మేనేజర్‌లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. క్షేత్ర స్థాయిలో కనీస పరిశీలన లేకుండానే మేనేజర్, సూపర్‌వైజర్, సీఈఓ అడ్మినిస్ట్రేటివ్ సర్క్యులర్‌కి వ్యతిరేకంగా రుణాలు మం జూరు చేయటంతో అక్రమాలకు తెరలేచింది. ఇదే విషయాన్ని నాబార్డు కూడా తప్పు పట్టింది. గత ఐదేళ్లుగా సాగిన రుణ మాఫియా భాగోతంలో అసలు దోషుల పై చర్యలు తీసుకునేందుకు బ్యాంకు సీఈఓ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్ర మాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్‌లు సృష్టించి రూ. 5 కోట్ల వరకు ఈ బ్రాంచ్ నుంచి కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చా రు. కొందరు తహసీల్దార్‌లు,వీఆర్వో లు నిం దితులుగా ఉన్నారు. జీడీసీసీ అక్రమాలపై మొత్తం 18 కేసులు నమోదు అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంకు కు చెందిన 42 శాఖల్లో నూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నల్లపాడు జీడీసీసీ శాఖలో కూడా రూ. 70 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా, వివాదం ముదురుతున్న తరుణంలో రుణాలు తీసుకున్న వ్యక్తులు కొంత మొత్తం తిరిగి చెల్లించారు.

పెనాల్టీ పడితే అంతే..

ఏ బ్యాంకు అయినా ఆర్బీఐ పెనాల్టీ విధించడం తీవ్రమైన చర్యగా భావిస్తారు. దానివల్ల రానున్న రెండేళ్ల పాటు పెనాల్టీ విధించబడిన బ్యాంకు కు సంబంధించిన అన్ని విషయాల పై ఆర్బీఐ కన్ను వుం టుంది. పెనాల్టీ వేసిన తర్వాత బ్యాంకు కు సంబంధించిన డిపాజిట్లు విత్ డ్రా పై ఆర్బీఐ నియంత్రణ ఉంటుందని చెబుతు న్నారు. ఇష్టానుసారంగా డిపా జిట్లు విత్ డ్రా చేయడానికి ఆర్బీఐ ఒప్పుకోక పోగా, పరిమితి కూడా పెడుతుంది. ఆర్బీఐకి సంబంధిం చిన ఆడిటర్ల చేత పెనాల్టీ విధించిన బ్యాంకు ను తనిఖీ చేయిస్తారని తెలుస్తున్నది. అంత మాత్రమే కాకుండా రెండేళ్ల పాటు అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలపై కూడా ఆర్బీఐ కఠినంగా వ్యవహరిస్తుంది.

తమ్మవరం రోడ్డుకు మోక్షం

రూ.1.44 కోట్లతో నిర్మాణానికి అనుమతులు


గుంతలతో అధ్వానంగా ఉన్న తమ్మవరం రోడ్డు

మేదరమెట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి అధ్వానంగా మారిన రోడ్లకు మోక్షం లభించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రయాణానికి కూడా వీలులేకుండా గుంతలతో ఉన్న రోడ్లను గుంతలు పూడ్చి ప్రయాణానికి అనుకూలంగా చేశారు. ప్రభుత్వం కొద్దిగా కుదురుకున్నాకా గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో తమ్మవరం రోడ్డుకు రూ.1.44కోట్ల నిధులు మంజూరు చేయించారు. మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తమ్మవరంలో గుండ్లకమ్మ నది వద్దున 20వేల ఎకరాలకు సాగు నీరు అందించే కొరిశపాడు ఎత్తిపోతల పథకం, 4,500 వేల ఎకరాలకు నీరు అందించి తమ్మవరం-2 ఎత్తిపోతల పథకంతో పాటు తమ్మవరం గ్రామంలో 500ఎకరాలకు సాగు నీరు అందించే ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న ఈథనాల్ ఫ్యాక్టరీ, విండ్ పవర్ తయారీకి అవసరమైన విడి భాగాలను తయారు చేసే పరిశ్రమ ఉంది. వీటి అన్నింటికీ తోడు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పీడీఎస్ బియ్యం నిల్వచేసే గోడౌన్‌లు ఇక్కడే ఉన్నాయి. కంకర, గ్రావెల్ ఈ ప్రాంతం నుంచే చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా అవుతుంది. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించడం పట్ల మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఈ రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని ఈ నిధులు మంజూరుతో తమ కష్టాలు తీరనున్నాయని తమ్మవరం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పట్టుబడిన బియ్యంతో అధికారులు అబ్రహం, సురేష్ బాబు

60 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మార్టూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారిపై ఒంగోలు వైపు కోనంకి గ్రామ సమీపంలో వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల (60 బస్తాలు) రేషను బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అబ్రహం తెలిపారు. బియ్యంకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవన్నారు. డ్రైవర్ వెంకటేష్, జొన్నలగడ్డ బంగారురాజుపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. బియ్యం బస్తాలను వలపర్లలోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లులో ఉంచామన్నారు. ఈ బియ్యం ఎక్కడ నుంచి వస్తున్నాయో తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ దాడులలో ఇంకొల్లు డీటీ సురేష్ బాబు కూడా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు

మూడు కేంద్రాలలో 833 మందికి

25 మంది ఇంటర్ సెకిండియర్ విద్యార్థులు గైర్హాజర్

అద్దంకిటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుని హాల్‌టికెట్లను పరిశీలించి తమతమ రూములకు చేరుకున్నారు. అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 833 మంది విద్యార్థులకుగాను 808 మంది హాజరుకాగా, 25 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ ఎం.వీ రాంజనేయులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టంగా పనిచేయండి

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది పటిష్టంగా పని చేయాలని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం చీరాల పరిధిలో జరుగుతున్న ఇంటర్ సెకండియర్ పరీక్ష కేంద్రాలు ఏకేపీ, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలల వద్ద నిర్వహిస్తున్న బందోబస్తును పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు గుర్తు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

మహిళలను గౌరవించాలి

వేటపాలెం (చీరాల), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన వారోత్సవాలు నిర్వహించారు. ఈక్రమంలో సమాజంలో ప్రస్తు తం మహిళల పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నియంత్రణపై అవగాహన కల్పించారు. అలాగే వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్న విషయాన్ని గుర్తించాలని సీడీపీవో సుభద్ర అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో క్యాండిల్‌తో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎన్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల, ఆదర్శ స్కూల్‌లో విద్యార్థినులకు సోమవారం వ్యాసరచ న పోటీలను నిర్వహించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాల పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పోలీసు మహిళా సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌తో ప్రయోజనం


సర్టిఫికెట్‌లను ప్రదర్శిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాకల్టీ డెవలప్ మెంట్‌తో విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెరిగి ప్రయోజనకరంగా ఉంటుందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏఐఫర్ నెక్స్ జనరేషన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఈసీఈ బ్రాంచి ప్రొఫెసర్ శ్రీహరిరావు హాజరయ్యారు. ఐదురోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, డా.కిరణ్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల అవగాహనలో వేటపాలెం రైతులు

వేటపాలెం(చీరాల), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చిరుధాన్యాల అవగాహన కార్యక్రమంలో వేటపాలెం మండలంకు చెందిన 15 మంది హాజరయ్యారు. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ బాపట్ల వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొనగా, మొత్తం బాపట్ల జిల్లా నుంచి 50 మంది రైతులు హాజరయినట్లు అధికారులు తెలిపారు. అవగాహనలో చిరు ధాన్యాలు వాటి ఆవశ్యకత, విత్తనాల ఎంపిక, వాటి ప్రయోజనాలపై అవగాహన జరిగింది. మంగళవారంతో టూర్ ముగుస్తుందని అధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లో జరిగిన చిరుధాన్యాల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వేటపాలెం రైతులు

పారిశ్రామికవేత్తలుగా మహిళలు రాణించాలి

- ఎమ్మెల్యే కొండయ్య
- యూనియన్ బ్యాంకు సహకారంతో రూ.40కోట్ల చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, బ్యాంక్ అధికారులు

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలు సూక్ష్మ, చిన్న తరహా, పెద్ద తరహా పరిశ్రమల నుంచి పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం పొదుపు సంఘాల మహిళలకు రూ.25కోట్లు, ఎంఎస్‌ఎంఈకు రూ.9కోట్లు, వ్యాపారులకు రూ.6కోట్ల రుణాలు మంజూరు చేశారు. పేరాల పద్మశాలీయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ముందుగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ తాతా వేణుగోపాల్, రీజనల్ అధికారి రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ పద్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల్లో కూడా పొదుపు సంఘాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. బ్యాంకు సేవలను సక్రమంగా వినియోగించుకోవడం వలన ఆర్థిక స్వావలంబన ఉంటుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా చేనేతలు 79 చేనేత సొసైటీలు ఉండగా, వాటిల్లో 7900 మగ్గాలతో జీవనం గడిపే నిరుపేదలు ఉన్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నిస్సహాయంగా ఉన్నట్లు వివరించారు. అందరినీ గుర్తించి పథకాలతో పాటు, పొదుపు సంఘాల ద్వారా రుణాలు కల్పించి ఆదుకుంటామన్నారు. అలాగే పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు శివకృష్ణ, రామకృష్ణ, హ్యాండ్‌లూమ్ ఏడీ నాగమల్లేశ్వరరావు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్, సీఎంఎం కొండయ్య, ఏపీఎంలు మధు, సుబ్బారావు, మోహన్‌రావు, టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు తదితర పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తీరిన గవినివారిపాలెం ప్రజల చిరకాల కోరిక

కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామంలో బ్యాంకును ఏర్పాటు చేయాలంటూ మండల పరిధిలోని గవినివారిపాలెం వాసులు తిరగని గడప లేదు. ఎక్కని కార్యాలయం మెట్లూ లేవు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ఇటీవల ఒంగోలు బ్యాంకు అధికారులుతో జరిగిన చర్చలు ఫలించాయి. సోమవారం పేరాలలో జరిగిన చెక్కుల పంపిణీ సమయంలో జిల్లా అధికారులు ఏప్రిల్‌లో గవినివారిపాలెం పరిధిలోని కొత్తపాలెంలో బ్రాంచిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్థులు. ఆప్రాంత పొదపు సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవను కొనియాడారు.

దేవతామూర్తుల విగ్రహాలకు స్వాగతం


విగ్రహాలకు కలశాలతో గ్రామంలోకి ఆహ్వానిస్తున్న గ్రామస్థులు(ఇన్‌సెట్‌లో) విగ్రహాలు

మార్టూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో త్వరలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం గ్రామస్థులు పూలతో,పసుపునీళ్లతో స్వాగతించారు.దేవస్థానంలో ప్రతిష్ఠించేందుకు దేవస్థానం కమిటి సభ్యులు తిరుపతిలో దేవతామూర్తుల విగ్రహాలను తయారుచేయించారు. వాటిలో పంచలోహాలతో వేణుగోపాలస్వామి, సత్యభామాదేవి, రుక్మిణి, విశ్వక్షయనుడి విగ్రహాలను తయారు చేయించారు. అంతేగాకుండా రాతి విగ్రహాలుగా కూడా వేణుగోపాలస్వామి, సత్యభామాదేవి, రుక్మిణితోపాటు ఆంజనేయస్వామి, ద్వారపాలకుల విగ్రహాలను కూడా తయారుచేయించారు. ఆదివారం రాత్రి ఇసుకదర్శి గ్రామానికి తీసుకువచ్చిన దేవతామూర్తుల విగ్రహాలను సోమవారం ఉదయం జాతీయరహదారి ఇసుకదర్శి రోడ్డు నుంచి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. వాటిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరు పై ఊరేగింపుగా తీసుకువస్తూ, గ్రామస్థులు ముఖ్యంగా పురుషులు తలపై కలశాలతో స్వామి వారిని కీర్తిస్తూ, వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ, మహిళలు రోడ్డుపై నీటితో వార్లు పోస్తుండగా, భక్తి పారవశ్యంతో విగ్రహాలను గ్రామంలోకి స్వాగతించారు. నూతనంగా నిర్మిస్తున్న దేవస్థానం నిర్మాణం పూర్తయిన తర్వాత దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అప్పటిదాకా దేవతామూర్తుల విగ్రహాలను భద్రంగా ధాన్యాదివాసంలో జాగ్రత్త పరిచారు.

పట్టభద్రుల పోరులో టీడీపీ దూకుడు

(5వ పేజీ తరువాయి)

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను రిట ర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. ఎన్నికల నిర్వ హణలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్‌ని పకడ్బం దీగా అమలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతి నిధు లు, అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు పోలింగ్, ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఎక్కడా ఎలాంటి అస్పష్టతకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించారు.

గత ఎన్నికల్లో కంటే ఈ దఫా లక్ష ఓట్లు అధికం గా పోలింగ్ అయ్యాయి. అయినప్పటికీ ఫలితం ముందుగానే వెలువడేలా చేశారు. కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండటంతో నాలుగు వరసల్లో ఏడు టేబుళ్ల చొప్పున 28 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. ఇది ఓట్ల లెక్కింపుని సులభతరం చేసింది.

రిమ్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజి, జీజీహెచ్, నర్సింగ్ కాలేజీలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ప్రకాశం.ఏపీ.జీఓవి.ఇన్/నోటీస్ కేటగిరీ/రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి, విద్యార్హత సర్టిఫికెట్‌లతో జతపరచాలని పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రం... నకిలీ సిత్రం

(5వ పేజీ తరువాయి)

మధ్యలో ఉన్న కొద్ది రోజుల్లో అధికారిక స్టాంపులతో దోచిపెట్టారా! అనేది అర్థంకాని విషయం. సాధారణంగా జగనన్న కాలనీల్లో భూములు ఇవ్వాలంటే పేదలయి ఉండాలి. కానీ ఇక్కడ కొన్ని సంస్థల పేరుపెట్టి కొందరు వ్యక్తులు భూములను నొక్కేశారు. సామాన్యుడికి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక్క సెంటు భూమి మాత్రమే అప్పటి జగన్ సర్కారు ఇస్తే, వీరు రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తీసుకున్నారు. అయితే పేదలకు కేటాయించిన ప్లాట్లలో అయితే ఆధార్ వంటి అన్ని పత్రాలు అప్‌లోడ్ చెయ్యాల్సిన పరిస్థితి ఉండటం, సంస్థలకు వీటిలో ఇచ్చే అవకాశం లేకపోవటంతో ఒక్కో కాలనీలో ఇళ్ల కేటాయించిన లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలు, పార్క్, ఆట స్థలాల వంటివాటి కోసం కేటాయించిన కమ్యునల్ స్థలాలను టార్గెట్‌గా చేసుకుని వాటిని ఈ నకిలీ పత్రాలతో ఆక్రమించేశారు.

ధ్రువీకరణ పత్రాలతో పన్నుల చెల్లింపు

ఒక భూమిపై హక్కు పొందాలంటే ప్రభుత్వం అధికారికంగా అందించిన పట్టా ఉండాలి. లేక నివేశన స్థల ధృవపత్రం కానీ, పట్టా కానీ ఉండాలి. కానీ ఇక్కడ నకిలీ ధృవీకరణ పత్రాలు పుట్టుకొచ్చాయి. పెదరావూరు లేఔట్‌లో కమ్యునల్ స్థలాన్ని ఆక్రమించి ఉండటం గుర్తించిన రెవెన్యూ అధికారులు వారిదగ్గరున్న పట్టాను చూపాలని కోరటం, రెండు ప్రయివేటు సంఘాల పేరుతో స్థలాలు పొందినట్టు ధృవపత్రాలు చూపటంతో వాటిని పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. అయితే ఇదే తరహాలో తాజాగా ఒక ప్రయివేటు స్థలానికి, మండల పరిధిలోని మరికొన్ని ప్రభుత్వ స్థలాలకు ఇదేతరహా పత్రాలను చూపి పన్నులు చెల్లించనట్టు సమాచారం అందటంతో అధికారులు వీటిపై దృష్టిపెట్టారు. మండలంలో ఎక్కడెక్కడ ఎంత మేర ప్రభుత్వ భూములను ఆక్రమించారో తెలుసుకునే పనిలో పడ్డారు.

ఇంతటి వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా జరిగే అవకాశం తక్కువ. అయితే దీనికి సహకరించింది ఎవరు? ఇంకా ఎంతమందికి! ఎన్ని రూ. కోట్ల విలువైన స్థలాలను అప్పగించేశారనేది తేలాల్సిఉంది. దీనిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. అధికారికంగా చెప్పకున్నా, ఈ నకిలీల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారని మాత్రం సమాచారం.


బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్పెల్ బీ విజేత రేణంగివరం బాలికల జట్టు

పంగులూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయి స్పెల్లింగ్ బీ పోటీలో రేణంగివరం ప్రాథమికోన్నత పాఠశాల బాలికలు విజేతగా నిలిచారు. మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో పేర్ని సుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 6,7,8 తరగతుల బాల బాలికలకు స్పెల్లింగ్‌బీ పోటీలు నిర్వహించారు. పోటీలో వివిధ పాఠశాలల బా బాలికల జట్లు పాల్గొనగా రేణంగివరం, బూదవాడ, కొండమంజులూరు, చందలూరు జట్లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పేర్ని వీరనారాయణ, హెచ్‌ఎం వడ్లమూడి వేణుబాబు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆసక్తి కలిగిన వారికి మహిళా దినోత్సవం సందర్భంగా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ప్రభుత్వం ఇస్తుందని ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు మహిళలు గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90రోజుల పాటు శిక్షణ అందించి మిషన్లు కూడా అందజేస్తారని అమె తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా ఈ శిక్షణ బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రహ్మణ కులాలకు చెందిన మహిళలకు ఈ శిక్షణ అందిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చినగంజాం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాత కాలనీవాసులకు ఇళ్ల పట్టాలి ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఎం చీరాల ఏరియా కమిటీ నాయకులు జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలను నిర్మించాలని కోరుతూ రాజమాత కాలనీవాసులు తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీవి.రాంప్రసాద్, శ్రీనివాసరావు, రాజమాత కాలనీవాసులు కే.గోపి, చిన్నం ఏసు, కత్తుల శ్రీను, బొజ్జ ఆంజనేయులు, మావెళ్ళ రాము, పెద్దకత్తుల మహాలక్ష్మీ, మెంబరు శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

సూరవరపుపల్లిలో స్ప్రింక్లర్ల పైపులు దగ్ధం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుంజిపాపారావు ఇంటివద్ద ఉంచిన స్ప్రింక్లర్ల పైపులు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. వాటిని ఎవరైనా కావాలనే తగులబెట్టారా.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనేది తెలియలేదు. అర్ధరాత్రి పెద్దగా మంటలు రావడం స్థానికులు గమనించడంతో పాపారావు కుటుంబసభ్యులు నిద్రలేచి చుట్టుపక్కల వారి సహాయంతో మంటలను ఆర్పివేశారు. పొలాలకు నీళ్ల పెట్టుకోవడానికి గతంలో పాపారావు ఈ పైపులను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు, మార్చి 3 : (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, వక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దరిచేరవని హోమియో వైద్యుడు దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఉప్పుటూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధులకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మోటార్‌సైకిల్

అద్దంకి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని మోటార్‌సైకిలిస్టు వెనుక నుంచి ఢీకొనంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం పెదకంచర్లకు చెందిన చందోలు విజయరాజు సోమవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వైపు వెళ్తూ నామ్ రోడ్డులో అద్దంకి మండలంలోని మణికేశ్వరం క్రాస్ రోడ్డు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన విజయరాజును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


సారా స్థావరాలపై దాడులు

- ఇద్దరు అరెస్ట్
- 12.50 లీటర్లు స్వాధీనం

చీరాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చీరాల ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా వాడరేవుకు చెందిన నాగండ్ల వాసును అదుపులోకి తీసుకుని అతని వద్ద 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రకాష్ నగర్‌లో దాడులు నిర్వహించి భవనం గోపిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 4.50 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

తప్పిన పెనుప్రమాదం


తగులబడిన గడ్డి

వీరన్నపాలెం (పర్చూరు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మంగళవారం మండలం వీరన్నపాలెంలో చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా, నర్సాయపాలెం నుంచి వీరన్నపాలెం వస్తున్న గడ్డి ట్రాక్టర్ స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోకి రాగానే విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డికి అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న గ్రామస్థులు అప్రమత్తమై మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో నివాలు ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.





పట్టా తీసుకునే సమయంలో ప్రమాణం చేస్తున్న నూతన గ్రాడ్యుయేట్లు

వైద్యసేవల్లో అంకితమవుతాం!

- నూతన గ్రాడ్యుయేట్ల ప్రమాణం
- ఉత్సాహంగా ప్రభుత్వ వైద్యకళాశాల గ్రాడ్యుయేషన్ డే
- 177మంది వైద్యులకు పట్టాల పంపిణీ
- నెల్లూరు మెడికల్ కాలేజీకి మంచి పేరు తేవాలి
- పీజీకి సన్నద్ధం కావాలని వక్తల పిలుపు

'వృత్తి పట్ల నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తాం. వైద్యవృత్తిలో కొత్త పరిజ్ఞానాన్ని నేర్చుకుంటాం. తల్లిదండ్రుల ఆశయాల మేరకు బాధ్యతగా మెలగతాము. మానవతా విలువలు పాటించి రోగులకు అందించే వైద్యసేవల్లో అంకిత భావంతో పని చేస్తాం.' అంటూ నూతన వైద్య గ్రాడ్యుయేట్లు ప్రమాణం చేశారు. సోమవారం రాత్రి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా జరిగింది. 2019-25 బ్యాచ్ వంద శాతం ఫలితాలు సాధించగా, 177 మంది వైద్యులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల (పీజీ) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ తాజా గ్రాడ్యుయేట్లు సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా వైద్య చికిత్సలు అందించాలని కోరారు. ఈ పోటీ ప్రపంచంలో గ్రాడ్యుయేషన్‌తోనే ఆపకుండా పీజీ చేసినప్పుడే గౌరవం ఉంటుందని చెప్పారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వైద్యులు టీ-20 క్రికెట్ మ్యాచుల్లా పరుగులు తీయాల్సి ఉంటుందని చెప్పారు. నీట్ పరీక్షలో పీజీ సీటు కొట్టేలా రేపటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. మరో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా మాట్లాడుతూ ప్రస్తుతం ఎంబీబీఎస్‌తోనే ప్రాక్టీస్ చేయాలంటే నెలకు కేవలం రూ.35 వేలు మాత్రమే వస్తాయని, అలా కాకుండా పీజీ పూర్తి చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. వైద్య కళాశాల, జీజీహెచ్ డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్యులు మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు విజిత, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

\- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



మెడికోల కేరింత



కుటుంబంతో కలిసి పట్టా అందుకుంటున్న ఓ విద్యార్థిని

సీఐడీకి 'మాగుంట' కేసు!

- సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్ తరలింపు
- నాడు రూ.కోట్లు కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- భోక్తల పనిపట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- కేసును సీఐడీకి అప్పగిస్తూ కీలక నిర్ణయం

నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నాడు సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన గ్రావెల్ దోపిడీని నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో నమోదైన గ్రావెల్ కేసును సీఐడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో 2021లో అక్రమార్కులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆయన పేరుతో వారి పొలానికి గ్రావెల్ అవసరమన్నట్లు దరఖాస్తు చేసి అనుమతులు పొందారు. లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను లేఅవుట్లకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. నాటి ప్రతిపక్ష టీడీపీ ఆందోళనలతో విచారణ జరిపిన ఇరిగేషన్ అధికారులు.. 'సర్వేపల్లి'లో అనుమతులకు మించి తవ్వకాలు జరిపింది వాస్తవమని తేల్చారు. అందుకు బాధ్యులపై వెంకటాచలం స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. దీంతో తూపిలి ఉదయ్ కుమార్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, బి శ్రీధర్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తీరా దర్యాప్తులోకి వచ్చే సరికి ఎంపీ పేరుతో కూడా అనుమతులు పొందినట్లు తేలింది. దీనిపైపై ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఈ వ్యవహారం ఎక్కడ వైసీపీ పెద్దల మెడకు చుట్టుకుంటోందనన్న భయంతో ఈ కేసును పక్కనపడేశారు.



సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు (ఫైల్)

● సీఎంవో ఆదేశాలతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి, కనుపూరు చెరువుల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. గత నవంబరులో ఈ గ్రావెల్ అక్రమ తవ్వకాలకు సంబంధించి నివేదిక ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో జరిగిన వ్యవహారాలన్నీ ఇరిగేషన్ అధికారులు సీఎంవోకు నివేదిక రూపంలో అందించారు. అలానే పోలీసులు కూడా గ్రావెల్ కేసు వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశారు. వీటన్నిటినీ పరిశీలించిన ప్రభుత్వం గ్రావెల్ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. గ్రావెల్ అక్రమ తవ్వకాల కన్నా ఒక ఎంపీ సంతకాన్ని ఫోర్జరీ చేయడాన్ని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. నెల్లూరులోని సీఐడీ విభాగానికి కాకుండా రాష్ట్ర స్థాయిలోని ఒక ప్రత్యేక బృందానికి ఈ కేసును అప్పగించినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఈ బృందం నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారుల స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతోందని, త్వరలోనే సంచలనాలు వెలుగుచూసే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాల గుసగుసలాడుకుంటున్నాయి.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

నెల్లూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాలిటీలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించి విద్యాశాఖ వెబ్‌సైట్, కార్యాలయ నోటీస్‌బోర్డుల్లో అందుబాటులో ఉంచామని డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వతేదీ లోపు జిల్లా విద్యాశాఖ, గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయానికి పూర్తి స్థాయి వివరాలను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

● స్కూల్ లాగిన్స్‌లో టెన్త్ హాల్‌టికెట్లు

టెన్త్ పరీక్షల హాల్‌టికెట్లను సోమవారం నుంచి పాఠశాలల లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ తెలిపారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఫోన్ నుంచి హాయ్ అనే మెసేజ్‌ను 9552300009 నెంబర్‌కు పంపి సేవను ఎంచుకోండి అనే ఆప్షన్ ద్వారా విద్యాసేవలు సెలక్ట్ చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థి అప్లికేషన్ నెంబర్, చైల్డ్ ఐడీ, పుట్టినతేదీ వివరాలు నమోదు చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లో నగదు జమ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఇటీవల సంగం మండలంలో పర్యటించిన రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణ రెడ్డి రైతులకు 24గంటలకంటే ముందుగానే ధాన్యం డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారు. సంగం ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు కంఠాబత్తిన శ్రీహరిరెడ్డి, కంఠాబత్తిన వినోద్‌రెడ్డి ఈ నెల 1వ తేదీన 258 బస్తాల బీపీటీ రకం ధాన్యాన్ని పుట్టి రూ.19,770 వంతున విక్రయించారు. విక్రయించిన 24 గంటల్లోనే అంటే 3వ తేదీన (2వ తేదీన ఆదివారం సెలవు) రూ.1,25,280లను రాష్ట్ర పౌరసర ఫరాల సంస్థ చెల్లించింది. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే తమకు ప్రభుత్వం నగదు జమ చేయడం పట్ల ఆ రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు జేసీ కార్తీక్ జిల్లాలో ముమ్మరంగా పర్యటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం వీటిని పర్యవేక్షిస్తున్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజున 23,905 మంది హాజరు



కావలి : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



నెల్లూరు : పరీక్షల అనంతరం ఎండలో నిలబడి ఉన్న విద్యార్థులు

నెల్లూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 79 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ తొలిరోజు ద్వితీయభాష (తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ) పరీక్షను ప్రశాంతంగా నిర్వహించా రు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించలేదు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రాష్ట్ర కార్యాలయం తోపాటు జిల్లాకేంద్రం లోని ఆర్‌ఐఓ కార్యాలయం ద్వారా ప్రత్యక్షంగా పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు పరిశీలించారు. తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. తొలిరోజున జనరల్ విద్యార్థులు 23,396 మందికిగాను 22,950 మంది హాజరవగా, 446 మంది గైర్హాజరు అయ్యారు. అలాగే ఒకేషనల్‌కు 1002 మందికి 47 మంది గైర్హాజరవగా 955 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయనతోపాటు డీవీఈఓ, డీఈసీ సభ్యులు, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

● 7 నుంచి మూల్యాంకనం

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 7వతేదీన ప్రారంభిస్తున్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంబంధిత సంస్కృత లెక్చరర్లను రిలీవ్ చేసి 7వ తేదీన స్పాట్ వాల్యూయేషన్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌స్కూల్) ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన తొలిరోజు పరీక్షకు 3,179 మందికి 2,871 మంది హాజరైనట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు.



వెంకటాచలంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసు కానిస్టేబుల్

సచివాలయ ఏఎన్‌ఎంలకు

పదోన్నతులు

- 249 మందికి అవకాశం
- ఇప్పటికే జాబితా సిద్ధం.. అభ్యంతరాల స్వీకరణ
- కలెక్టర్ అనుమతి పొందాక తుది జాబితా

నెల్లూరు (వైద్యం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ఏఎన్ఎంలకు పదోన్నతులు లభించనున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ విజయానంద్ ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత ఏడాది డిసెంబరులోనే ఏఎన్ఎంల వివరాలు సేకరించగా, మెరిట్ జాబితా తయారు చేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏఎన్ఎంలకు ఆ జాబితాను అందుబాటులో ఉంచారు. వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించి డీఎంహెచ్‌వో సుజాతతోపాటు జడ్పీ సీఈవో విద్యారమ, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్‌ల కమిటీ ఏఎన్ఎంల పదోన్నతిపై నిర్ణయం తీసుకుంటారు. చివరగా కలెక్టర్ ఆనంద్ నుంచి అనుమతులు పొందాక పదోన్నతుల జాబితా ప్రకటించనున్నారు.



● 249 మందికి పదోన్నతి

జిల్లావ్యాప్తంగా 813 సచివాలయాల్లో 813 మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన, మెరిట్ జాబితా ప్రకారం 249 మందికి పదోన్నతులు లభించనున్నాయి. గ్రేడ్-3లో ఏఎన్ఎంలు గ్రేడ్-1 పదోన్నతి లభిస్తుంది. అలాగే ఒక్కో ఏఎన్ఎంకు రూ.32 వేల వేతనం అందుతుండగా, పదోన్నతి లభిస్తే రూ.7 వేలు పెరిగే అవకాశం ఉంటుంది.



అందరి అభిప్రాయాలు తీసుకుంటాం

సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతుల జాబితా రూపొందించాం. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా లేదా అన్న వివరాలు కూడా సేకరిస్తున్నాం. అన్ని రకాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తుది జాబితా రూపొందిస్తాం. రిజర్వేషన్ ప్రాతిపదికన ఈ పదోన్నతులు ఉంటాయి.

\- సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సంచార పశువైద్య

సేవలకు బ్రేక్!

- జేడీ కార్యాలయ ఆవరణలో 9 అంబులెన్సులు
- మిగిలిన పది వాహనాలూ వెనక్కి?
- ఏజెన్సీకి ముగిసిన గడువు
- పాడిరైతుల్లో ఆందోళన

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులకు అందుతున్న సంచార పశువైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీ గడువు ముగిసిపోవడమే ఇందుకు కారణం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 9 సంచార పశువైద్య అంబులెన్సులకు బ్రేకులు పడగా, మిగిలిన వాహనాల ఎప్పుడు నిలిచిపోతాయోనన్న ఆందోళన పాడిరైతుల్లో నెలకొంది.

● నిలిచిన 9 సంచార పశు అంబులెన్సులు

గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైతే నేరుగా ఇంటి వద్దకే వచ్చి పశువైద్యం అందించేందుకు గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంచార పశువైద్య అంబులెన్సులు అందుబాటులోకి తెచ్చింది. 2021లో మొదటి విడతగా 9 అంబులెన్సులు, రెండో విడతగా 10 వాహనాలు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. వైద్యుడు, ఫార్మసిస్టులు, టెక్నీషియన్, పైలట్‌తోసహా నలుగురు సిబ్బంది పాడిరైతులకు సేవలందించేలా ప్రణాళికలు రూపొందించారు. 1962 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే చాలు అంబులెన్సులు నేరుగా వారి ఇంటి వద్దకు వెళ్లి సేవలందిస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా వీటి నిర్వహణను జీవీకే ఫౌండేషన్‌కు అప్పగించారు. అయితే గత నెలతో నిర్వహణ కాలవ్యవధి పూర్తయింది.



జేడీ కార్యాలయ ఆవరణలో సంచార పశు వైద్య అంబులెన్సులు

1వ తేదీ నుంచి నిలిచిన సేవలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవలందిస్తున్న సంచార పశు అంబులెన్సుల సేవలు మార్చి 1వతేదీ నుంచి నిలిచిపోయాయి. మొదటి విడతగా జిల్లాకు వచ్చిన 9 వాహనాలను డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉంచారు. వాహనాల ఫిట్‌నెస్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం నుంచి పశుసంవర్థక శాఖకు అందాయి. ఆ తర్వాతే వాటిని ప్రభుత్వానికి అందజేయనున్నారు. అయితే రెండో విడతలో మంజూరైన 10 అంబులెన్సు సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ సేవలు కూడా ఎక్కడ నిలిచిపోతాయోనని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించనున్నారని, అందువల్లే సేవల్లో జాప్యం నెలకొందని కొందరు అధికారులు చెబుతున్నారు.



ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకే సంచార పశు వైద్య అంబులెన్సులు నిలిచాయి. మొదటి విడతలో మంజూరైన 9 వాహనాల ఫిట్‌నెస్‌లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే డిప్యూటీ డైరెక్టర్లు పరిశీలిస్తున్నారు. అంబులెన్సుల నిర్వహణ ఏజెన్సీ కాలపరిమితి పూర్తవడంతో ప్రస్తుతం వాహనాలు నిలిచాయి.

\- రమేష్‌నాయక్, పశుసంవర్థక శాఖ జేడీ

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లేదా స్కూల్ వద్దకు వచ్చి దరఖాస్తు అందజేయవచ్చని పేర్కొన్నారు.

చెత్తను సంపదగా మార్చుకుందాం

బిట్రగుంట, మార్చి3(ఆంధ్రజ్యోతి): చెత్తను సంపదగా మార్చుకోవడానికి అవసరమైన వనరులన్నింటినీ వినియోగించడంపై గ్రీన్‌గార్డ్స్, గ్రీన్ అంబాసి డర్స్‌కు పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతి ఇంటినుండి తడి, పొడ చెత్తలను వేరువేరుగా సేకరించి వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ పనుల నిమిత్తం రూ.లక్ష చెక్కును సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులకు అందజేశారు. కుర్రపల్లి మెయిన్ పాఠశాలలో మిగులు నిధులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెక్ రూపంలో అందజేశామన్నారు.

నిత్యావసరాల వితరణ

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అనసూయనగర్‌లోని తాంద్ర లక్ష్మయ్య కుటుంబానికి సోమవారం జనసేన నాయకులు దాడి భాను కిరణ్, చదలవాడ హరీష్ సహకారంతో నెలరోజులకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేశారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రతినెలా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి వినతి

కందుకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని కోటా రెడ్డినగర్‌లో సిమెంటురోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఓవీ రోడ్డులోని అంకమ్మతల్లి పెట్రోలు బంకు నుంచి క్లబ్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తులు చేశారు.

కుంటుపడుతున్న అభివృద్ధి

- టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఫిర్యాదులతో వేడెక్కిన రాజకీయం
- అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వని ఎంపీపీ

లింగసముద్రం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ, వైసీపీ నేతలు జిల్లా ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో రాజకీ యం వేడెక్కింది. గత నెల 23న లింగసముద్రం ఎం పీడీఓ కార్యాలయంలో జరిగిన పరిణామాలతో ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకు న్నారు. అయితే కూటమి ప్రభుత్వ కొలువుదీరిన నాలుగైదు నెలల కిందట మండలంలో రూ.3కోట్ల ఉపాధి నిధులతో పలు గ్రామాల్లో టీడీపీ నేతలు సీసీ రోడ్లను నిర్మించారు. అయితే అప్పట్లో ఈ పనులకు ఎంపీపీ తీర్మానాలను ఇవ్వడంతో ఈ పనులు సాఫీగా జరిగాయి. ఈ పనులను ప్రారంభించే ముందు టీడీపీ నేతలకు ఎంపీపీ మధ్య ఒప్పందం కుదిరినట్టుగా ప్రచారం జరుగుతోంది. తమ పార్టీ వారు చేసిన పనుల బిల్లులు సుమారు రూ.22లక్షలు ఒకేసారి ఇస్తామని చెప్పడం వలన సీసీ నిర్మాణాలకు తీర్మానాలు ఇచ్చినట్టు ఎంపీపీ చెబుతున్నారు. అయితే తాము అలా చెప్పలే దని, వైసీపీ వారికి రావాల్సిన బిల్లులు రెండు విడతలుగా ఇచ్చేందుకు అంగీకరించామని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

ప్రస్తుతం నిధుల వివరాలు ఇలా..

మండల నిధులు రూ.40 లక్షల వరకు ఉన్నాయని అం దులో రూ.11 లక్షలు వైసీపీ వారికి ఇచ్చి, మిగిలిన నిధులతో టీడీపీ వారు పనులు చేస్తారని, మరో విడత వచ్చే నిధు లలో మిగిలిన రూ.11లక్షలు వైసీపీ వారికి ఇస్తామని చెప్పినా వారు అంగీకరించ లేదని టీడీపీ నేతలు చెబు తున్నారు. తమకు బిల్లులు ఇవ్వక పోతే కోర్టుకు వెళ్లి తెచ్చుకుంటామని వైసీపీ నేతలు చర్చిం చుకుంటున్నారు. దీంతో మండలంలో పనులు చేసే విషయంలో ప్రతిష్టంభన నెలకొంది.

రెండు నెలలుగా ఇదే సమస్య..

రెండునెలలుగా నెలకొన్న ఈ సమస్యతో మండలంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అలాగే మండ లానికి మంజూరైన రెండు సీసీరోడ్ల నిర్మాణం నిధులు రూ.40లక్షలు మరో మండలానికి ఉ న్నతాధికారులు కేటా యించినట్టు అధికారులు తెలి పారు.



లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయం

అలాగే మండలానికి 25 గోకులం షెడ్లు మం జూరయ్యాయి. ఇవి ఒక్కోక్కటి రూ.2.50 లక్షలతో ని ర్మించాల్సి ఉంది. అలాగే 1000 సోక్ పిట్లు మంజూ రవగా ఒక్కోక్కటి రూ.6వేలతో నిర్మించాలి. అలాగే పెదపవని, చినపవనిలో సీసీ నిర్మాణానికి రూ.20 లక్షలు చొప్పున మొత్తం రూ.40లక్షలు మంజూర య్యాయి. ఆ నిధులు కూడా ఉన్నతాధికారులు మరో మండలానికి కేటాయించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మండలానికి వచ్చే నిధులు రాకుండా పోయే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమౌతోంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలిగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ ఓ సాయిలక్ష్మి, ఉపాధ్యాయిని సుగుణమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు విజయలక్ష్మి, హైమవతి పాల్గొన్నారు.

కావలి పీజీ కేంద్రంలో నేడు జాబ్‌మేళా

కావలిటౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి)కావలి పట్టణంలోని వీఎస్‌యు పీజీ కళాశాలలో ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లామెంట్ ఆఫీస్, సీడాప్‌ల సంయుక్తంగా 4వ తేది జాబ్ మేళ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలనుంచి 2గంటల వరకు జాబ్ మేళ జరుగుతుందని మెడ్‌ప్లస్, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, కాల్మన్ సర్వీసెస్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియేగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు ముగ్గురు గైర్హాజరు

కొండాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు ముగ్గురు గైర్హాజరయినట్లు పరీక్షల ముఖ్య నిర్వాహణాధికారి శ్రీహరి తెలిపారు.

చెత్తను ఆదాయ వనరుగా మార్చాలి

కావలి రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను తయారు చేసి పంచాయతీలకు ఆదాయవనరుగా మార్చాలని ఎమ్పీడీవో శ్రీదేవి తెలిపారు. మండలంలోని మన్నంగిదిన్నెలో చెత్త సంపద తయారీ కేంద్రంలో సోమవారం వలేటివారిపాలెం పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వలేటివారిపాలెం ఎమ్పీడీవో నరేంద్రదేవ్, ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శి గీత ఉన్నారు.

స్పందించిన అధికారులు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

కావలి రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరులో దర్జాగా కబ్జాలంటూ సోమవారం ఆంధ్రజ్యో తిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసిన అట్టల ఫ్యాక్టరీ స మీపవాసులు తమ ప్రాంతంలో జరు గుతున్న ఆక్రమణలపై తహసీల్దారు శ్రావణ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ ప్రాంతంలో ప్ర భుత్వ స్థలాలు, రోడ్ల ఆక్రమణలకు గు రౌతున్నట్లు తహసీల్దారు దృష్టికి తీసు కువెళ్లారు. ఆక్రమణ కట్టడాలు ఆ పాలని, రికార్డులు పరిశీలించాలని రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ను ఆదేశించారు.

దోమల నివారణకు ఫాగింగ్

కావలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): 7వ వార్డులో సోమవారం మున్సిపల్ కార్మికులు ఫాగింగ్ మిషన్ ద్వారా పొగ వదిలారు. గత కొద్ది రోజులుగా అన్ని వార్డులలో దోమలు తగ్గకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీల ఆందోళన

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నేతలు బి.వరలక్ష్మి, కె.శైలజ, కమతం అనూరాధ, సుమలు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కా ర్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సీఐ టీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌లతో కలిసి కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి తమ దుస్థితిని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే షాహినా, లోకేశ్వరిలు ఉన్నారు.

సమస్యను పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కందుకూరు, మార్చి 3(ఆంధ్ర జ్యోతి): స్థానిక ఏరియా హాస్పటల్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హాస్పటల్ కార్మికసంఘం నా యకులు, ఏఐటీయూసీ జిల్లా మాజీ కార్యదర్శి బి.సురేష్‌బాబు మాట్లాడారు. మూడున్నర ఏళ్లుగా ప్రావిడెంట్ ఫండ్, నాలుగు నెలలుగా జీతాలు కూడా ఇవ్వటం లేదని చెప్పారు. రోజువారీ వేతనంతో కుటుంబాలను పోషించుకునే కార్మికులకు ఇలా చేయడం తగదన్నారు. పెరిగిన పని భారంకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డి మాండ్ చేశారు. తక్షణ సమస్యల పరిష్కారంకు చర్యలు తీ సుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో వై. ఆనంద్‌మోహన్, కార్మికుల యూనియన్ నాయకులు వెంకటరత్నం, ఖాజాబీ, చిన్నమ్మాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ఈడీకి సత్కారం

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని రైతులు, బోర్డు అధికారులు సోమవారం బదిలీపై వెళుతున్న పొగాకుబోర్డు ఈడీ శ్రీధర్‌బాబును సత్కరించి వీడ్కోలు పలికారు. పొగాకు ఎగుమతులు పెరిగేలా.. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. పరిమితికి మించి పండించిన పొగాకు అమ్ముకునేందుకు రైతులు చెల్లిస్తున్న అపరాధ రుసుంను రద్దు చేయించి లబ్ధి చేకూరేలా చేశారన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం ఎం. లక్ష్మణరావు, బోర్డు అధికారులు కేవీ రామాంజనేయులు, ఎం.కిరణ్, బి.చంద్రశేఖర్, శివకుమార్, రాజగోపాల్, రైతు ప్రతినిధులు తాటికొండ రమణయ్య, గుండాల కొండారెడ్డి, వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్‌ను పునరుద్ధరించాలని వినతి

కందుకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం నలదలపూరు కాలనీలో మూలనపడిన ఆర్‌వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సోమవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు గ్రీవెన్స్‌లో సీఐ టీయూ, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు జీవీబీ కుమార్, దువ్వూరి జాన్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ ప్లాంట్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం

- వ్యాపారులకు నోటీసులు

కావలి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని అన్ని హోల్‌సేల్ దుకాణాలు, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసరు, రైతు బజారు వ్యాపారుల సంఘం అధ్యక్షులకు నోటీస్‌లు జారీ చేశారు. మున్సిపల్ సిబ్బంది రాకను గమనించిన కొందరు హోల్‌సేల్ ప్లాస్టిక్ వ్యాపారులు కొందరు తమ దుకాణాలను మూసి వేసుకుని వెళ్లటంతో దుకాణాల గోడలమీద నోటీసులు అంటించి వాట్సాప్‌లో ఆ దుకాణం నిర్వహకుడికి నోటీస్ పంపి ఫోన్ చేసి చెప్పినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని వారు తెలిపారు.

మాకు నివాస స్థలాలు చూపించండి

- తహసీల్దారుకు గిరిజనుల వినతి



వినతిపత్రం ఇస్తున్న నార్తు మోపూరు ప్రజలు

అల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తమకు పట్టాలు మంజూరు చేసి ఇప్పటికీ నివాస స్థలాలు చూపించలేదని నార్తుమోపూరు ప్రగతి నగర్ కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్లులేని నిరు పేదలమైన తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని కానీ నివాస స్థలాలు చూపించకుండా కాలయాపన చేశారని నేటికీ తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదని వాపోయారు. తమకు ఇచ్చిన పట్టాల ఆధారంగా స్థలాలను చూపించాలని కోరారు. కార్యక్రమంలో పరశురామయ్య, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

టార్గెట్‌బాల్ పోటీల్లో కొత్తసత్రం బాలికల ప్రతిభ

కావలి టౌన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రం నల్గొండలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ బాలికల టార్గెట్‌బాల్ పోటీల్లో మండలంలోని కొత్తసత్రం బాలికలు శాలిని, సరిత, శ్రీలేఖలు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పీడీ మురళి విజేతలను అభినందించారు.

న్యూస్ బాక్స్

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం మార్చి3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం వరద ప్రవాహం నమోదు కాలేదు. పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా 58.250 ప్రస్తుతం టీఎంసీలు ఉంది. డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బాబా మందిర వార్షికోత్సవం

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పడమటిపాళెం షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కలశ స్థాపన, హోమం, పూజలకు కోటంరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

భవన నిర్మాణ కూలి పెంపు

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు, ఇతరత్రా ధరలు పెరిగిన దృష్ట్యా ఉదయగిరి ప్రాంతంలో భవన నిర్మాణ కూలీల రేట్లను పెంచినట్లు టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఉన్న కూలీ రేట్లకు అదనంగా రూ.50 పెంచామన్నారు. ఇక నుంచి బేల్దారి మేస్త్రీకి రోజుకు రూ. 850, మహిళా కూలీకి రూ.550, పురుషుడికి రూ.600 నిర్ణయించినట్లు భవన నిర్మాణ యజమానులు సహకరించాలన్నారు.

సేవలు వినియోగించుకోండి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): ప్రభుత్వ పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 30వరకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా ల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చరిత్ర కనుమరుగు..

- రాయల కాలం నాటి సాగరం చెరువు
- కాలక్రమంలో ఆనవాళ్లు ధ్వంసం
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు



అనంతసాగరం చెరువు

అనంతసాగరం మార్చి3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు 15శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. అలాంటి చెరువుకు సంబంధించిన పురాతన ఆనవాళ్లు కనుమరుగుతుండగా అధికారుల్లో చలనం లేదు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో రెండు కొండల మధ్య దీని నిర్మాణం చేపట్టారు. సుమారు 0.75 టీఎంసీలు నీటి సామర్థ్యం కలిగిన చెరువు కింద 5 వేల ఎకరాల ఆయకట్టుకు ఏటా రెండు పంటలకు నీరు సరిపడేలా నీరు ఉంటుంది. ఇక నిర్మాణంలో 5 నుంచి 20 అడుగుల పొడవు 3 నుంచి 5 మీటర్ల వెడల్పు, సుమారు టన్ను నుంచి 5 టన్నుల బరువు కలిగిన కొండ రాళ్లతో చెరువు కట్ట, అలుగు ప్రాంతాలను నిర్మించారు. అయితే నిర్మాణానికి కారణమైన ఈ రాళ్లు ఎక్కడి నుంచి సేకరించారు? ఎలా తెచ్చారు? అనేది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. ప్రధానంగా మూడు తూములు ద్వారా నీరు అందిస్తున్న సాగరం చెరువు జిల్లాలో పెద్ద చెరువుల్లో రెండవదిగా పేరుగడించింది. చెరువు కట్టపై అలనాటి చిన్నపాటి దేవాలయాలు, అలుగు ప్రాంతంలో చరిత్రకు సాక్ష్యంగా శిలాశాసనం, గొల్లభామ ప్రతిమ ఏర్పాటు చేశారు. 2007లో గొల్లభామ దేవతా ప్రతిమ కింద గుప్తనిధులు కోసం పెకలించగా తిరిగి పునరుజ్జీవనంతో శిలను పతిష్ఠించారు. ఇక అలుగు ప్రాంతాన్ని గత వైసీపీ ప్రభుత్వం ధ్వసం చేసి అభివృద్ధి పేరుతో నూతనంగా నిర్మాణం చేపట్టారు. ఈక్రమంలో భారీ యంత్రాలతో ఉన్న రాళ్లు పెకలించి చరిత్ర ఆనవాళ్ల రూపరేఖలు కోల్పోయాయి. ఇప్పటికీ అలుగు నిర్మాణం కోసం వినియోగించిన పెద్ద బండలు అక్కడ ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి నిర్మాణం కావడంతో నేటికి దుండగలు గుప్త నిధులు కోసం అన్వేషణ సాగిస్తూ చెరువు పరిసరాల్లో తవ్వకాలు జరుపుతూ ఉన్నకాడికి దోచుకుపోతున్నారు. ఇకనైన సాగరం చెరువు భవిష్యత్తు తరాలకు తెలిసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ధ్వంసం చేసిన శిలాశాసనం

వేర్వేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- అర్జీదారుల తికమక



ఎంపీడీవో కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న షాలెట్

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం అధికారులు వేర్వేరుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించారు. గతంలో తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అర్జీలు అందచేసేవారు. అక్కడ అన్ని శాఖల అధికారులు హాజరయ్యేవారు. వచ్చిన అర్జీలను తహసీల్దారు పరిశీలించి అక్కడికక్కడే వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు పంపేవారు. కానీ సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లా నాయక్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు ఎక్కడ, ఎవరికి అర్జీలు ఇవ్వాలో తెలియక తికమక పడ్డారు.

- గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజలు ఆరు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు సుభద్ర, ఎంపీడీవో అప్పాజీలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీలకు సత్వరమే పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. ఇకపై ప్రతి శాఖ అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలని, లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రజలు సైతం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వారు కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌ఐ

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటార్ యాక్ట్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి పత్రాలు సరిలేని వాటికి జరిమానా విధించారు. ఈనెల 1 నుంచి మోటార్ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం నూతన వాహన చట్టంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన కాలనీ నిర్మాణాలను కాంట్రాక్టరే నిర్మించాలి

సంగం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వెంగారెడ్డిపాళెం జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను గతంలో నిర్మించిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వంలో స్లాబు లెవల్ వరకు పనులు చేసి ఎన్నికలు రావడంతో నిలిపివేశారు. ఈ విషయంపై సోమవారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

చేజర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్ర భుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తహసీల్దారు బి.మురళి సూచించారు. సోమవా రం స్థానిక ఆర్ఎస్‌కే కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, ఉడతా హజరత్తయ్య, ఏవో శశిధర్ పాల్గొన్నారు.

- సంగం: స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయించి తొలి బోణీ చేసిన సంగం కంఠాబత్తిన శ్రీహరిరెడ్డి అనే రైతుకు సోమవారం రైతు బ్యాంకు ఖాతాకు రూ. 1,25,280ల నగదు జమ చేసినట్లు నాయకుల శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు తెలిపారు.

ఎండీయూ వాహనం మీద జగన్ బొమ్మపై ఆగ్రహం

ఉదయగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): యాదవపాళెంలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనంపై మాజీ సీఎం జగన్ బొమ్మ ఉండటం చూసి టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉందనే భ్రమలో ఉన్నారని తెలిపారు.

క్షయవ్యాధి నియంత్రణ బృందం పర్యటన

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా క్షయ వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశాల మేరకు నర్రవాడ పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపేట, నర్రవాడ పంచాయతీల్లో సోమవారం క్షయవ్యాధి నియంత్రణ బృందం పర్యటించింది. ఆయా పంచాయతీల్లో 2023 నుంచి క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులను, ప్రస్తుతం దగ్గుతో బాధపడుతున్న అనుమానితుల నివాసాలకు వెళ్లి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వైద్యులు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్రవాడ వైద్యాధికారి హరీష్, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, షబ్బీర్, షఫీ, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఇయర్ ఇంటర్ పరీక్ష ప్రశాంతం

సంగం/సీతారామపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలల్లో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. 184 మంది విద్యార్థులకు 177 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సుమతి ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని ఏపీ మోడల్ స్కూలులో జరిగిన పరీక్షలకు 112 మందికి 111 మంది విద్యార్థులు హాజరయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సీఎస్ రెహమాన్ తెలిపారు.

150 ఎకరాల కబ్జాకు యత్నం

జేసీకి గ్రామస్థుల ఫిర్యాదు

కలువాయి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగురాయపురంలో వివాదాస్పదంగా ఉన్న 150 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దీన్ని అడ్డుకోవాలని గ్రామస్థులు సోమవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 540 నుంచి 598 వరకు ఉన్న ప్రభుత్వ భూమి 150 ఎకరాలను ఒక వ్యక్తి 40 ఏళ్ల క్రితం పలువురు బినామీ పేర్లు మీద పట్టాలు తీసు కున్నారని పేర్కొన్నారు. అయితే గ్రామానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు పట్టాలు ఇవ్వడంతో స్థానికులు వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ విషయం కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు.

అంగన్‌వాడీలకు రవాణా భత్యం చెల్లింపు



కార్యకర్తలకు నగదు అందజేస్తున్న ఎంఈవో-2 శ్రీనివాసులు

ఉదయగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు గతనెలలో నిర్వహించిన జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి సంబంధించిన రవాణా భత్యం నగదును సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవో-2 శ్రీనివాసులు అందజేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'టీఏలు ఇప్పించండి సార్' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులకు సంబంధించి రవాణా భృతం కింద ప్రభుత్వం అందజేసిన రోజుకు రూ.50ల చొప్పున ఒక్కొక్కరికి రూ.300 చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

ఉదయగిరి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్య పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఉదయగిరి సబ్ డివిజన్ జేఈ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఏడీఈ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు గండిపాళెం మసీదు వీధిలో ఎప్పటి నుంచో నేలకొరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సమీప నివాసాల ప్రజలతో చర్చించగా స్తంభం లేకపోవడంతో అంధకారం నెలకొందని వాపోయారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట లైన్‌మెన్ వెంకట్రావు ఉన్నారు.